పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నంచడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 1 సంచిక : 340 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 13 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 340 PAGES : 8 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : THADEPALLI GUDEM TUE 13 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు..

స్థలాన్ని మార్చగలరేమో కానీ ప్రజాగ్రహాన్ని మార్చలేరన్న కాంగ్రెస్

- ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలం జాబితా నుంచి తొలగింపు
- ప్రభుత్వ నిర్ణయంపై తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు
- స్థలం మార్చగలరేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చలేరని వ్యాఖ్య
- ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, గొంతు నొక్కే ప్రయత్నమని ఆరోపణ
- ఢిల్లీలో నిరసనల కోసం రామ్‌లీలా మైదానం సహా మూడు కొత్త ప్రాంతాల గుర్తింపు

- మిగతా 2లో

బంగాళాఖాతంలో అల్పపీడనం..

దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష సూచన

- దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం
- రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం
- అక్టోబర్ 14 నుంచి దక్షిణ కోస్తాంధ్ర, తమిళనాడులో భారీ వర్షాలు
- రాయలసీమ, కేరళ, కర్ణాటకలోనూ విస్తారంగా వానలు కురిసే సూచన
- ఈశాన్య రుతుపవనాల రాకకు అనుకూల పరిస్థితులు

పెన్ పవర్ డెస్క్:దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వ్యవస్థ దక్షిణ బంగాళాఖాతం మీదుగా తమిళనాడు, శ్రీలంక తీరం వైపు కదులుతున్నందున దక్షిణ భారతదేశ వ్యాప్తంగా వర్షాలు ఊపందుకోనున్నాయి.

- మిగతా 2లో

తిరుపతి స్వరూపం మారనుంది..

వేల కోట్ల ప్రాజెక్టులకు చంద్రబాబు శంకుస్థాపన

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

- తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం
- అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన
- టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధికి ఆమోదం
- భక్తుల సమాచారం కోసం 'వెంకటాద్రి యాప్'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం

ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్

తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో యాత్రికుల కోసం వసతి సముదాయాలు నిర్మించనున్నారు. నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు అందుబాటులోకి రానుండగా, రోజుకు 15 వేల మందికి పైగా భక్తులు బస చేసే వీలుంటుంది. రూ.160 కోట్లతో నిర్మించే నూతన అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది

- మిగతా 2లో

ఏపీ మున్సిపాలిటీల రిజర్వేషన్ల తుది జాబితా

- ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లకు తుది రూపు
- మొత్తం 106 మున్సిపాలిటీలు, 17 కార్పొరేషన్లకు తుది జాబితా విడుదల
- మున్సిపాలిటీలలో బీసీలకు 35, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 చైర్మన్ పీఠాలు
- అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు 50 స్థానాలు కేటాయింపు
- రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న పురపాలక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 106 మున్సిపాలిటీలు, 17 మున్సిపల్ కార్పొరేషన్లలో ఛైర్మన్, మేయర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం తుది జాబితాను ప్రకటించింది.

- మిగతా 2లో

'నో' చెప్పారా.. మీ ఖాతాలో నగదు మాయం

హైదరాబాద్:పెన్ పవర్ : సైబర్ మోసాలపై హైదరా బాద్ సీపీ సజ్జనార్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. 'నో' అని ఒక్కసారి రిప్లై ఇచ్చినా ఖాతా ఖాళీ అయ్యే ప్రమాదముం దని చెప్పారు. ఓటీపీలు చెప్పకపోయినా.. లింకులపై క్లిక్ చేయకపోయినా నగదు మాయమయ్యేలా

- మిగతా 2లో

ప్రతి నియోజకవర్గంలో శ్రీవారి ఆలయాల నిర్మాణం

- శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5,000 ఆలయాలు నిర్మించడమే లక్ష్యమన్న ఆనం
- ప్రతి నియోజకవర్గంలో రూ.5 నుంచి రూ.10 కోట్లతో శ్రీవారి ఆలయం
- 6,700 ఆలయాల్లో దూపదీప నైవేద్యాలకు నెలకు రూ.10,000 జమ

- మిగతా 2లో

ఎల్‌ఓసీ వద్ద మందుపాతర పేలుడు: నలుగురు ఉగ్రవాదులు మృతి

- కృష్ణ ఘాటిలో మందుపాతరల పేలుడులో నలుగురు ఉగ్రవాదులు మృతి
- మృతుల్లో లష్కరే తోయిబా కమాండర్ మహమ్మద్ ఫైజాన్ ఉన్నట్లు సమాచారం
- పూంఛ్ జిల్లాలో ఎల్‌ఓసీ వెంబడి భద్రత కట్టుదిట్టం
- సత్వాల్-నాకి ప్రాంతంలోనూ పేలుడు కలకలం
- మెంధర్‌లో రెండు పాత మందుపాతరలను నిర్వీర్యం చేసిన సైన్యం

పెన్ పవర్ డెస్క్:జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) దాటి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన నలుగురు ఉగ్రవాదులు మందుపాతరల పేలుడులో మరణించారు. వీరిలో లష్కరే తోయిబా కీలక

- మిగతా 2లో

విజయవాడ బైపాస్‌లో కాలిబూడిదైన ఈవీ కారు..

నలుగురి సజీవదహనం

- విజయవాడ పశ్చిమ బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
- ప్రమాదం అనంతరం ఈవీ కారులో చెలరేగిన మంటలు
- ఘటనా స్థలంలోనే నలుగురు మృతి, మరొకరి పరిస్థితి విషమం
- నంబూరులో ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా జరిగిన దుర్ఘటన
- మృతులు నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తింపు

- మిగతా 2లో

ఈసీ ఫైల్స్ అన్నీ బయటపెట్టాలి

సుప్రీంకోర్టులో ఇండియా కూటమి పిటీషన్లలోని ముఖ్యాంశాలు

పెన్ పవర్ డెస్క్:ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ లపై ఇండియా కూటమి నేతలు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. 2026 అక్టోబర్ 12న

- మిగతా 2లో

ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం

పెన్ పవర్ డెస్క్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించారు. ప్రస్తుతం సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాష్ మాథుర్ కేరళ గవర్నర్‌గా నియమితులయ్యారు.

- మిగతా 2లో

ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి 2026..

రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు పురస్కారం



- స్థూల ఆర్థిక స్థిరీకరణకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై పరిశోధనకు గుర్తింపు
- స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హాల్
- వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న వుడ్‌ఫోర్డ్
- ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకుల ఆర్థిక విధాన నిర్ణయాలకు వీరి పరిశోధనలు ప్రయోనకరం
- ఆర్థిక శాస్త్ర బహుమతిని స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో ఏర్పాటు

- మిగతా 2లో

ఎడిటర్ వ్యూ

2100 నాటికి మానవ వినాశనం? 17 ముప్పులను గుర్తించిన లాన్సెట్!

రాబోయే 75 ఏళ్ల కాలంలో మానవాళి మనుగడ తీవ్ర ప్రమాదంలో పడే అవకాశం ఉందా? శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఊహించని పురోగతి సాధిస్తున్న మనిషి, తన చేతులారా తనే వినాశనాన్ని కొనితెచ్చుకుంటున్నాడా? అంతర్జాతీయ ఆరోగ్య పరిశోధనా సంస్థ 'ది లాన్సెట్' విడుదల చేసిన నివేదిక ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. 2100 నాటికి మానవ ఉనికికే ఎసరు పెట్టే 17 ప్రధాన ముప్పులను నిపుణులు గుర్తించారు. మనిషి స్వయంగా సృష్టించుకున్న ఆ తీవ్ర ముప్పుల విశేషాలు ఏంటో ఇప్పుడు చూద్దాం..

మనిషి కొనితెచ్చుకుంటున్న వినాశనం:
ఒకప్పుడు ప్రకృతి వైపరీత్యాలు లేదా అంటువ్యాధుల వల్ల మాత్రమే మానవాళికి ముప్పు ఎదురయ్యేది. కానీ రాబోయే రోజుల్లో ప్రపంచానికి ఎదురయ్యే అతిపెద్ద ముప్పులు పూర్తిగా మానవ నిర్మితమేనని లాన్సెట్ కమిషన్ హెచ్చరించింది. మనిషి స్వయంగా సృష్టించుకున్న ఆధునిక సాంకేతికత, అణ్వాయుధాలు మరియు పర్యావరణ పరిరక్షణ పట్ల చూపిస్తున్న తీవ్ర నిర్లక్ష్యమే ఈ వినాశనానికి ప్రధాన కారణాలుగా మారనున్నాయి.

ఏఐ దుర్వినియోగం, అణు యుద్ధ భయాలు:
కృత్రిమ మేధ సాంకేతికతను సరిగ్గా వాడుకుంటే పర్వాలేదు కానీ, దాని దుర్వినియోగం పెరిగితే కోట్లాది మంది ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని నిపుణులు చెబుతున్నారు. మరొకవైపు అణు సమరం గనుక సంభవిస్తే.. దాని వల్ల వచ్చే పొగ, ధూళి సూర్యరశ్మిని భూమికి చేరకుండా అడ్డుకుంటాయి. ఇక దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడి, పంటలు పండక ఆకలి చావులు విపరీతంగా పెరిగే ప్రమాదం ఉందని ఈ అధ్యయనం హెచ్చరించింది.

కనిపించని ఆరోగ్య, సామాజిక సంక్షోభం:
ఇక కేవలం అణు యుద్ధాలు లేదా ఏఐ మాత్రమే కాకుండా వాతావరణ మార్పులు, పెరిగిపోతున్న వాయు కాలుష్యం, మానసిక ఆరోగ్య సమస్యలు కూడా మానవాళిని కుంగదీస్తున్నాయి. పోషకాహార లోపం, పెరుగుతున్న ఊబకాయం, యాంటీబయోటిక్ మందులకు లొంగని బ్యాక్టీరియా.. ఈ సమస్యలు సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే వీటిని నిర్లక్ష్యం చేయకూడదు.

సమగ్ర ప్రణాళికలతోనే పరిష్కారం:
ప్రపంచ దేశాల ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి ముందస్తు ప్రణాళికలు, నివారణ చర్యలు చేపడితే ఈ ప్రమాదాలను అరికట్టవచ్చని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సైనిక బడ్జెట్లు, ఆయుధాలపై ఖర్చు చేయడం కంటే ప్రజారోగ్యం, పర్యావరణం, ఏఐ సేఫ్టీ కోసం పెట్టుబడులు పెట్టడం ముఖ్యం. ఇక 35 మంది అగ్రశ్రేణి నిపుణులతో కూడిన కమిషన్ ఈ ప్రమాదాలపై ఏటా సమీక్ష నిర్వహిస్తూ నివేదికను నవీకరించనుంది. ఇక మొత్తానికి చూస్తే, 2100 నాటికి మానవ మనుగడ సాఫీగా సాగాలంటే ఇప్పటి నుంచే మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన వినాశనానికి దారితీసే అవకాశాలను మనమే తొలగించుకోవాలి. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, టెక్నాలజీని మంచి పనుల కోసం ఉపయోగిస్తేనే రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును ఇవ్వగలం.

తిరుపతి స్వరూపం మారనుంది..
వేల కోట్ల ప్రాజెక్టులకు చంద్రబాబు శంకుస్థాపన

భక్తులు భోజనం చేయవచ్చు. వీటితో పాటు రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తారు. వీటిలో ఒకేసారి 16 వేల మంది భక్తులు విశ్రాంతి తీసుకోవచ్చు. రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగంగా ఉండనున్నాయి.

టీటీడీ ఉద్యోగుల సొంతింటి కల సాకారం
దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో 5,192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించే లేఅవుట్ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.

మాస్టర్ ప్లాన్ రహదారులతో మారనున్న రూపురేఖలు
తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా సీఎం ప్రారంభించారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే నగరంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది. ప్రత్యేకించి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి మూడు కొత్త మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. ఈ సమగ్ర ప్రాజెక్టుల ద్వారా తిరుపతిని ఆధ్యాత్మిక రాజధానిగా మాత్రమే కాకుండా, అత్యుత్తమ మౌలిక వసతులున్న నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఎల్ఓసీ వద్ద మందుపాతర పేలుడు:
నలుగురు ఉగ్రవాదులు మృతి

- మొదటి పేజి తరువాయి
కమాండర్ మహమ్మద్ ఫైజాన్ కూడా ఉన్నట్లు సమాచారం. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని నాంగి టెక్రి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన మందుపాతరలు పేలడంతో నలుగురూ అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. మిగిలిన ముగ్గురిని వకాస్, ఇస్తియాక్, ఆసిమ్‌గా గుర్తించారు. ఎల్ఓసీ వెంబడి భద్రతా బలగాలు ఇప్పటికే నిఘాను కట్టుదిట్టం చేశాయి. ఈ ఘటనతో అప్రమత్తమైన సిబ్బంది సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు, పర్యవేక్షణను మరింత పెంచారు. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని సత్వాల్-నాకి ప్రాంతంలో సోమవారం జీరో లైన్ సమీపంలో పేలుడు జరిగినట్లు అంతకుముందు సమాచారం అందింది. పాకిస్థాన్ వైపు ఎల్ఓసీ వెంబడి కదులుతున్న ఓ బృందం సమీపంలో అనుమానిత ఐఈడీ పేలినట్లు అధికారులు తెలిపారు. ఆ బృందంలో చొరబాటుకు ప్రయత్నిస్తున్న ఉగ్రవాదులు ఉన్నారా? లేక గస్తీ నిర్వహిస్తున్న పాకిస్థాన్ భద్రతా సిబ్బందా? అన్నది తొలుత స్పష్టంకాలేదు. పేలుడుకు దారితీసిన పరిస్థితులపైనా అధికారులు ఆరా తీశారు. మరోవైపు, మెంధర్ సెక్టార్‌లోని బసోని ప్రాంతంలో సరిహద్దు కంచె సమీపంలో రెండు పాత మందుపాతరలను సైన్యం గుర్తించింది. రహదారి మార్గం నిర్మాణ పనుల సమయంలో సోమవారం ఉదయం 8.25 గంటలకు ఒకటి, మధ్యాహ్నం 12.10 గంటలకు మరొకటి బయటపడ్డాయి. సైనిక నిపుణులు నియంత్రిత పేలుళ్లతో వాటిని నిర్వీర్యం చేశారు. గత వారంలోనూ ఈ ప్రాంతంలో దాదాపు 12 మందుపాతరలను గుర్తించి నిర్వీర్యం చేసినట్లు సమాచారం.
ఎల్ఓసీ ప్రాంతాల్లో చొరబాట్లను అడ్డుకునేందుకు మందుపాతరలను ఏర్పాటు చేస్తుంటారు. అయితే భారీ వర్షాల కారణంగా అవి బయటపడి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో వాటిని గుర్తించడం, భద్రతను నిరంతరం పర్యవేక్షించడం సైన్యానికి సవాలుగా మారుతోంది.

బంగాళాఖాతంలో అల్పపీడనం..

- మొదటి పేజి తరువాయి
దీని ప్రభావంతో ముఖ్యంగా అక్టోబర్ 14 నుంచి కోస్తాంధ్ర, తమిళనాడు తీర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 15న కూడా తీరం వెంబడి వర్షాలు కొనసాగుతాయని తెలుస్తోంది. అక్టోబర్ 16 నుంచి 19 మధ్య ఈ వర్షాలు క్రమంగా లోతట్టు ప్రాంతాలకు విస్తరించనున్నాయి. తమిళనాడులోని అంతర్గత ప్రాంతాలు, కేరళ, రాయలసీమ, దక్షిణ కర్ణాటక, కర్ణాటక తీర ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తాయి. కొన్ని చోట్ల పిడుగులు, బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. తక్కువ సమయంలో తీవ్రమైన వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో అక్కడక్కడా ఆకస్మిక వరదలు సంభవించే అవకాశాన్ని కొట్టిపారేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ఉపసంహరణ చివరి దశలో ఉన్నందున, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఈ వాతావరణ వ్యవస్థ ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి దోహదపడొచ్చని భావిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి 20 మధ్య కాలంలో ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశం లేనప్పటికీ, గణనీయమైన వర్షపాతాన్ని ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి

ఏపీ మున్సిపాలిటీల రిజర్వేషన్ల తుది జాబితా

- మొదటి పేజి తరువాయి
ఈ ప్రకటనతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఒక ముఖ్యమైన ఘట్టం పూర్తయింది. ఇక అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించేందుకు మార్గం సుగమమైంది. ప్రకటించిన జాబితా ప్రకారం, 106 మున్సిపాలిటీలలో ఛైర్మన్ పదవులకు గాను బీసీ (వెనుకబడిన తరగతులు) వర్గానికి 35 స్థానాలు, ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) వర్గానికి 14 స్థానాలు, ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) వర్గానికి 3 స్థానాలు కేటాయించారు. అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు మొత్తం 50 స్థానాలు రిజర్వ్ చేయడం గమనార్హం. కేటగిరీల వారీగా రిజర్వ్ చేయబడిన పురపాలక సంఘాల పూర్తి వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

కేటగిరీల వారీగా పురపాలక సంఘాల జాబితా
ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) - 3
ఎస్టీ - మహిళ: గూడూరు
ఎస్టీ - జనరల్: ఆత్మకూరు, ఆలూరు

ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) - 14
ఎస్సీ - మహిళ: కొండపల్లి, నిడదవోలు, యలమంచిలి, చింతలపూడి, సూళ్లూరుపేట, గుత్తి, చీరాల.
ఎస్సీ - జనరల్: ఉయ్యూరు, నూజివీడు, కుప్పం, సామర్లకోట, పిఠాపురం, బాపట్ల, పొదిలి.
బీసీ (వెనుకబడిన తరగతులు) - 35
బీసీ - మహిళ: జంగారెడ్డిగూడెం, నర్సీపట్నం, నాయుడుపేట, చిలకలూరిపేట, ఇచ్ఛాపురం, కొవ్వూరు, పాలకొల్లు, గుంతకల్, గుడివాడ, నందిగామ, ముమ్మిడివరం, మదనపల్లె, నరసరావుపేట, అమలాపురం.
బీసీ - జనరల్: కావలి, కదిరి, బి.కొత్తకోట, కందుకూరు, హిందూపురం, ఆత్మకూరు (నెల్లూరు), అద్దంకి, కమలాపురం, నెల్లిమర్ల, మడకశిర, ఆళ్లగడ్డ, గురజాల, దాచేపల్లి, గొల్లప్రోలు, మార్కాపురం, నంద్యాల, బేతంచెర్ల, నందికొట్కూరు, దర్శి, గూడూరు (కర్నూలు), మైదుకూరు, బద్వేల్.

జనరల్ కేటగిరీ (మహిళ)
ఈ కేటగిరీ కింద మొత్తం 27 మున్సిపాలిటీలను మహిళలకు కేటాయించారు.
కనిగిరి, వెంకటగిరి, నరసాపురం, పలాస-కాశీబుగ్గ, పెడన, పలమనేరు, జమ్మలమడుగు, ఆకివీడు, పాలకొండ, పొన్నూరు, భీమవరం, జగ్గయ్యపేట, బుచ్చిరెడ్డిపాలెం, యర్రగుంట్ల, యలమంచిలి, కళ్యాణదుర్గ్, ఆమదాలవలస, పుంగనూరు, మాచర్ల, రాజంపేట, ఆదోని, డోన్, రాజాం, బొబ్బిలి, రేపల్లె, పులివెందుల, ఎమ్మిగనూరు.

అన్‌రిజర్వ్ (జనరల్)
కింది 26 మున్సిపాలిటీలు ఏ రిజర్వేషన్ పరిధిలోకి రాకుండా అన్‌రిజర్వ్‌గా ఉన్నాయి.
పుట్టపర్తి, పెనుకొండ, రాయచోటి, సాలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, తెనాలి, రామచంద్రాపురం, సత్తెనపల్లె, శ్రీకాళహస్తి, తుని, పార్వతీపురం, ప్రొద్దుటూరు, పుత్తూరు, మండపేట, నగరి, చీమకుర్తి, తిరువూరు, రాయదుర్గ్, గిద్దలూరు, వినుకొండ, పెద్దాపురం, ధర్మవరం, తాడిపత్రి, పిడుగురాళ్ల.
ఈ అధికారిక ప్రకటన వెలువడటంతో, మున్సిపల్ ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.
త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ రిజర్వేషన్ల ఆధారంగా ప్రధాన రాజకీయ పక్షాలు తమ వ్యూహాలకు పదును పెట్టడం, బలమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు కసరత్తులు ప్రారంభించనున్నాయి. రాబోయే రోజుల్లో పురపాలక రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి.

ప్రతి నియోజకవర్గంలో శ్రీవారి ఆలయాల నిర్మాణం

రాష్ట్రవ్యాప్తంగా శ్రీవాణి ట్రస్టు ద్వారా 5,000 ఆలయాలను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. నెల్లూరు జిల్లాలో ఈరోజు జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. పొదలకూరు మండలం మహమ్మదాపురం గ్రామంలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి ఆయన భూమిపూజ చేశారు.
ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ... రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఒక్కో శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రతి ఆలయానికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు కేటాయించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని 6,700 ఆలయాల్లో దూప, దీప, నైవేద్యాల కోసం అర్చకుల ఖాతాల్లో ప్రతినెలా రూ.10,000 జమ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆత్మకూరు మున్సిపాలిటీలో రూ.35 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి ఆనం శంకుస్థాపన చేశారు. సోమశిల జలాశయం నుంచి పైప్‌లైన్ ద్వారా ఆత్మకూరుకు తాగునీరు సరఫరా చేస్తున్నామని, పట్టణంలో అంబేద్కర్, షాదీ మంజిల్ భవనాలకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని ఆయన అన్నారు.

నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు..

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించడంపై రాజకీయ దుమారం రేగింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయం ఏకపక్షమని, ప్రజాస్వామ్యంలో ప్రజలే నిరసన స్థలాన్ని నిర్ణయిస్తారని, ప్రభుత్వం కాదని నేతలు మండిపడ్డారు. ప్రభుత్వం నిరసన స్థలాన్ని మార్చగలదేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని తగ్గించలేదని స్పష్టం చేశారు.
సోమవారం ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ, "ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నాం. అందుకే ప్రతిపక్షాలన్నీ కలిసి బారాఖంబా రోడ్డుకు వెళ్తున్నాం. సాధారణంగా బోట్ క్లబ్‌లో నిరసనలు జరుగుతాయి. మీరు నిరసన వేదికలను మార్చవచ్చు, కానీ ప్రజల కోపాన్ని తగ్గించలేరు" అని అన్నారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా స్పందిస్తూ, "దీన్ని ఎలా రద్దు చేస్తారు? ప్రజాస్వామ్యంలో ఎక్కడ నిరసన చేయాలో ఎవరు నిర్ణయిస్తారు? అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా గళం విప్పడానికి భారతదేశంలోని ప్రతి అంగుళం స్వేచ్ఛాయుతమైనదే. ఈ స్వేచ్ఛను మాకు రాజ్యాంగం ఇచ్చింది" అని పేర్కొన్నారు.
మరికొందరు కాంగ్రెస్ నేతలు తమదైన శైలిలో వ్యంగ్యంగా విమర్శలు గుప్పించారు. "ప్రభుత్వం ఈ దేశ పౌరులుగా మమ్మల్ని గుర్తించడం లేదు కాబట్టి, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాల్లో ఎక్కడైనా నిరసన స్థలం చూపిస్తే అక్కడికి వెళ్లి నిరసన తెలుపుతాం" అని సందీప్ దీక్షిత్ అన్నారు. హరియాణా ప్రతిపక్ష నేత భూపిందర్ సింగ్ హుడా మాట్లాడుతూ.. ప్రభుత్వం భయపడిందని, ప్రజల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. "ఢిల్లీ వారి తండ్రి ఆస్తి అన్నట్లుగా.. ఇక ఢిల్లీకి రావద్దని కూడా చెబుతారు" అని ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ విమర్శించగా, "ఇకపై హిమాలయాల శిఖరాలపై నిరసన చేస్తాం" అని మరో ఎంపీ ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు.
హోం మంత్రిత్వ శాఖ కమిటీ సిఫార్సుల మేరకు జంతర్ మంతర్‌ను నిరసనల కోసం నిర్దేశించిన స్థలం జాబితా నుంచి డీ-నోటిఫై చేసినట్లు ఢిల్లీ పోలీసులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. నిరసనల కోసం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం, బురారీ గ్రౌండ్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అనే మూడు కొత్త ప్రదేశాలను కేటాయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం కేంద్రం, ప్రతిపక్షాల మధ్య మరో రాజకీయ ఘర్షణకు దారితీసింది.

ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి 2026..
రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు పురస్కారం

ఆర్థిక శాస్త్రంలో 2026 నోబెల్ బహుమతిని అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు ప్రకటించారు. స్థూల ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకులను నియంత్రించేందుకు ఉపయోగపడే నమూనాల రూపకల్పనకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై వారు చేసిన పరిశోధనకు ఈ పురస్కారం దక్కింది. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ విషయాన్ని ప్రకటించింది.
రాబర్ట్ ఈ. హాల్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మైఖేల్ వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో రాజకీయ ఆర్థికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, మాంద్యం వంటి పరిస్థితులను ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు తోడ్పడతాయి. ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకుని తగిన విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ అధ్యయనాలు కీలకంగా నిలుస్తాయి. ఆర్థిక శాస్త్రంలో ఈ పురస్కారాన్ని అధికారికంగా 'ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్ర బహుమతి' అని పిలుస్తారు. స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో దీన్ని ఏర్పాటు చేసింది. 1969లో తొలిసారిగా ప్రదానం చేశారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్న అసలు ఐదు నోబెల్ బహుమతుల్లో ఆర్థిక శాస్త్ర పురస్కారం లేదు. అయినప్పటికీ మిగతా నోబెల్ పురస్కారాలతో పాటే ఏటా డిసెంబర్ 10న దీన్ని అందజేస్తారు. 1896లో అదే రోజున నోబెల్ మరణించారు. 2025లో ఈ బహుమతి జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు లభించింది. సాంకేతిక పురోగతి, నూతన ఆవిష్కరణలు దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఎలా దోహదపడతాయో వివరించినందుకు వారిని ఎంపిక చేశారు.

విజయవాడ బైపాస్‌లో కాలిబూడిదైన ఈవీ కారు.. నలుగురి సజీవదహనం

విజయవాడ నగర శివార్లలోని పశ్చిమ బైపాస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం జరిగిన ఈ దుర్ఘటనలో నలుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. వారు ప్రయాణిస్తున్న ఎలక్ట్రిక్ కారు (ఈవీ) ప్రమాదానికి గురైన వెంటనే మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనలో మరొకరు తీవ్ర గాయాలతో బయటపడగా, ఆయన పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతులను నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తించారు. వీరంతా నంబూరులో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి తమ ఇళ్లకు పయనమవుతుండగా ఈ విషాదం జరిగింది. వేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ప్రమాదానికి గురై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద వార్త తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆక్రందనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

'నో' చెప్పారా.. మీ ఖాతాలో
నగదు మాయం

- మొదటి పేజి తరువాయి
సరికొత్త సైబర్ మోసాలు వెలుగులోకి వస్తున్నట్లు ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. కేవలం వాట్సప్ సందేశాలతోనే, ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్‌తో కేటుగాళ్లు క్షణాల్లో సొమ్ము స్వాహా చేస్తున్నారని తెలిపారు. బ్యాంకు ఖాతా నుంచి నగదు డెబిట్ అయ్యిందంటూ గుర్తు తెలియని నంబర్ల నుంచి నకిలీ సందేశాలు పంపించి, లావాదేవీ చేయకపోతే 'నో' అని రిప్లై ఇవ్వాలని అడుగుతారని, ఆ సందేశాలకు స్పందించగానే మాల్‌వేర్ స్క్రిప్టులు యాక్టివేట్ అయ్యి.. మొబైల్ హ్యాకర్ల నియంత్రణలోకి వెళ్లే అవకాశముందని చెప్పారు. ఇటీవల చార్టర్డ్ అకౌంటెంట్ ఖాతా నుంచి రూ.లక్ష మాయమయ్యాని, అందుకే అందరూ అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే బ్యాంకు లావాదేవీల సందేశాలకు ఎస్, నో అంటూ ఎలాంటి సమాధానమివ్వొద్దని సూచించారు. ఖాతాలో నగదు తగ్గిందన్న సందేశం వస్తే.. అధికారిక బ్యాంకు యాప్‌లో స్టేట్‌మెంట్ తనిఖీ చేసుకోవాలని, ఇంకా అనుమానముంటే అధికారిక కస్టమర్ కేర్‌నే సంప్రదించాలని కోరారు. సైబర్ మోసం వల్ల డబ్బు పోగొట్టుకున్నట్లయితే 1930కి కాల్ చేయాలనీ, లేదంటే ఏఎవతీఏతీఱఎవ.స్త్రశీజ.ఱఅలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం

- మొదటి పేజి తరువాయి
కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తమిళనాడు గవర్నర్‌గా నియమితులయ్యారు. బ్రజ్ మోహన్ రామ్ ఒడిశా గవర్నర్‌గా నియమితులయ్యారు. డాక్టర్ సుధా యాదవ్ కర్ణాటక గవర్నర్‌గా నియమితులయ్యారు. డాక్టర్ ధల్ సింగ్ బిసెన్ ఉత్తరాఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. దుష్యంత్ గౌతమ్ సిక్కిం గవర్నర్‌గా నియమితులయ్యారు.

ఈసీ ఫైల్స్ అన్నీ బయటపెట్టాలి

- మొదటి పేజి తరువాయి
మార్చ్ ఫర్ డెమొక్రసీ నిర్వహించిన కూటమి నేతలు.. రాహుల్ గాంధీ సహా 11 మంది సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లను సుప్రీం కోర్టు స్వీకరించింది. ఎన్నికల సంఘం, సీఈసీ జ్ఞానేష్ కుమార్, ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లను రెస్పాండెంట్లుగా చేర్చారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సౌగత్ రాయ్ (టీఎంసీ), అఖిలేష్ యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ), తేజస్వి ప్రసాద్ యాదవ్ (ఆర్‌జేడీ), సంజయ్ రౌత్ (శివసేన యూబీటీ), ఎంఏ బేబీ (సీపీఎం), డీ రాజా (సీపీఐ), మహువా మొయిత్రా (జేఎంఎం), సుప్రియా సూలే (ఎన్‌సీపీ శరద్ పవార్), ఈటీ మొహమ్మద్ బషీర్ (ఐయూఎంఎల్) మొదలైన 11 మంది నేతలు పిటిన్లు దాఖలు చేశారు.

పిటిషన్లలో ఏముంది..?
సర్ ప్రక్రియకు సంబంధించిన అన్ని ఫైళ్లు, ఎజెండాలు, నిమిషాలు, నోటింగ్స్, అభ్యంతరాలు బయటపెట్టాలని కోరారు. జాతీయ స్థాయిలో ూ×= ప్రారంభించాలని ఎన్నికల సంఘం అధికారికంగా నిర్ణయం తీసుకున్నట్లు రికార్డులు లేవని =ు× సమాధానాల ఆధారంగా పేర్కొన్నారు. ఫారం-6ను నిబంధనలు సవరించకుండానే మార్చారని, ఇది మొదటి సారి ఓటు వేసేవారిపై అనవసర భారం వేస్తుందని విమర్శించారు.
2025 జూన్ 24 న సర్ ప్రారంభించాలని తీసుకున్న నిర్ణయంతోపాటు ఈసీనెట్, ఈఆర్ఓనెట్ యాక్సెస్ లాగ్‌లను వెల్లడించాలని కోరారు. జుజ×చీజు, జు=ూచీజు డేటాబేస్‌లు పారదర్శకంగా పనిచేయడం లేదని, ఓటరు పేర్లు తొలగించిన తర్వాత తిరిగి చేర్చే సౌకర్యం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 13 కోట్ల ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ దశలో తొలగింపుకు గురయ్యాయని పేర్కొంటూ, అర్హులైన ఓటర్లు బయట పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.
ఎన్నికల సంఘం సమష్టి అధికారాలను ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒంటరిగా వినియోగించుకున్నారని ఆరోపణ. ఇతర ఎన్నికల కమిషనర్ల అనుమతి లేకుండా నిర్ణయాలు తీసుకున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు.
ఆర్టికల్ 324, 2023 చట్టం, టీఎన్ శేషన్ కేసు తీర్పు ప్రకారం నిర్ణయాలు తీసుకున్నారా అని పరిశీలించాలని కోరారు. ఎలాంటి నోటీసు లేకుండా, వాదన వినిపించుకునే అవకాశం లేకుండా ఏ ఓటరును తొలగించకూడదని డిమాండ్ చేశారు. తొలగించిన ఓటర్ల జాబితాను బూత్ వారీగా, కారణాలు, డెమోగ్రాఫిక్ వివరాలతో ప్రచురించాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వంలో స్వతంత్ర ఆడిట్ కమిటీ ఏర్పాటు చేసి ఓటరు జాబితా మార్పులను పరిశీలించాలని కోరారు. కోర్టు తీర్పు వచ్చే వరకు సర్ ను తాత్కాలికంగా నిలిపివేయాలని పిటిషన్ లో పేర్కొన్నారు.

జాంపేట నుంచి నాగుల చెరువు వరకు బీటీ రోడ్డు పునరుద్ధరణ

రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 12:స్థానిక 28, 29, 30 డివిజన్లను అనుసంధానించే జాంపేట వంతెన నుంచి సాయికృష్ణ థియేటర్, డీలక్స్ సెంటర్ మీదుగా నాగుల చెరువు వరకు ఉన్న శిథిలావస్థకు చేరిన బీటీ రోడ్డును రూ.1.32 కోట్లతో పునరుద్ధరించే పనులకు నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు అమృత్ 2.0 పథకం కింద కూడా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. జాంపేట వంతెన కుడివైపు ఉన్న సమస్యను పబ్లిక్ హెల్త్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆ సమస్యకు శాశ్వత చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, నాయకులు చాపల చిన్నరాజు, వైవీడి ప్రసాద్, రుంకాని విజయ్, బి శివారెడ్డి, కృష్టాఫర్, అధిక సంఖ్యలో స్థానిక కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

రెవెన్యూ సేవల్లో జాప్యాన్ని సహించేది లేదు

- నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలి
- వెబ్‌ల్యాండ్ పోర్టింగ్, భూముల రీసర్వే పనులు వేగవంతం చేయాలి
- రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను సకాలంలో అందించాలి
- పెండింగ్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు
- రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశాలు

గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 12:రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వెబ్‌ల్యాండ్ పోర్టింగ్, భూముల రీసర్వే, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, రెవెన్యూ వన్, ఓఆర్‌సీఎంఎస్, పెండింగ్ అర్జీల పరిష్కారం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.

వెబ్‌ల్యాండ్ పోర్టింగ్ పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో వెబ్‌ల్యాండ్ పోర్టింగ్‌కు సంబంధించి మొత్తం 136 గ్రామాల్లో పనులు చేపట్టగా, అక్టోబర్ 9 నాటికి 97 గ్రామాల్లో పోర్టింగ్ పూర్తయిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన 39 గ్రామాల్లో పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. షేప్ ఫైళ్లు, డీఎల్ఆర్ వివరాల నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ-కేవైసీ పురోగతి తక్కువగా ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

475 గ్రామాల్లో రీసర్వే పనులు పెండింగ్

జిల్లాలో మొత్తం 829 గ్రామాలకు సంబంధించి భూముల రీసర్వే పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. వీటిలో 80 గ్రామాలు పూర్తిగా ముంపునకు గురైన లేదా నిర్జన గ్రామాలుగా గుర్తించగా, మిగిలిన 749 గ్రామాల్లో రీసర్వే చేపట్టాల్సి ఉందన్నారు. మొదటి, రెండో దశల్లో 274 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పూర్తికాగా, మరో 475 గ్రామాల్లో పనులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు వివరించారు. పెండింగ్ పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయడంతో పాటు అవసరమైన నోటిఫికేషన్ల జారీని వేగవంతం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు, డివిజనల్ అధికారులు, జాయింట్ కలెక్టర్ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

పాస్ పుస్తకాల పంపిణీలో 92.58 శాతం పురోగతి

జిల్లాలో అక్టోబర్ నెలకు సంబంధించి 5,214 పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 4,827 పుస్తకాలను రైతులకు అందజేసినట్లు అధికారులు తెలిపారు. 92.58 శాతం పురోగతి నమోదుకాగా, మరో 387 పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. మారేడుమిల్లి మండలంలో నూరు శాతం, రంపచోడవరం మండలంలో 98.76 శాతం పంపిణీ పూర్తయిందని వివరించారు. మిగిలిన పాస్ పుస్తకాలను అర్హులైన రైతులకు త్వరితగతిన అందించాలని కలెక్టర్ ఆదేశించారు. సెప్టెంబర్ నెలలో 1,720 పుస్తకాల లక్ష్యానికి గాను 1,715 పుస్తకాలు పంపిణీ చేసి 99.71 శాతం పురోగతి సాధించినట్లు అధికారులు వెల్లడించారు.

రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి

రెవెన్యూ వన్ కార్యక్రమంలో భాగంగా భూ రికార్డుల డిజిటలైజేషన్, గ్రామాల వారీ వివరాల నవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని 830 గ్రామాలకు గాను 806 గ్రామాల వివరాల నవీకరణ పూర్తయి 97.11 శాతం పురోగతి నమోదైనట్లు అధికారులు తెలిపారు. అయితే తహసీల్దార్ల తుది ఆమోదం 610 గ్రామాలకు మాత్రమే పూర్తయిందని వివరించారు. మిగిలిన గ్రామాల వివరాలను పరిశీలించి తుది ఆమోద ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గుర్తేడు, చింతూరు, ఏటపాక మండలాల్లో పెండింగ్‌లో ఉన్న వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ప్రజా అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రజా అర్జీల పరిష్కారంలో జాప్యాన్ని నివారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఓఆర్‌సీఎంఎస్ నివేదిక ఆధారంగా అధికారుల వారీగా పెండింగ్ అర్జీల స్థితిగతులను సమీక్షించారు. జిల్లా విభజన నేపథ్యంలో ఇతర జిల్లాల కలెక్టర్ల లాగిన్‌ల నుంచి బదిలీ అయిన అర్జీలను కూడా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. గడువు దాటిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పునఃప్రారంభించిన అర్జీలను సైతం నిర్లక్ష్యం చేయకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ పృథ్వి రాజ్ కుమార్, సిహెచ్ నరేంద్ర పడాల్‌తో పాటు రెవెన్యూ శాఖ అధికారులు, డివిజనల్ స్థాయి అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పశు సంపద రక్షణకు చర్యలు చేపట్టాలి

జిల్లా కలక్టరేట్ పీజీఆర్ఎస్ లో బిజెపి జనతా వారధి బృందం వినతి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబరు 12: పశుపోషక రైతుల సమస్యల పరిష్కారం, పశువైద్య సేవలు, పశుగ్రాస భద్రత, బీమా-- పరిహారం, గోకులం షెడ్లు, ప్రభుత్వ పథకాల సమర్థ అమలుకు చర్యలు తీసుకోవాలని బిజెపి జనతా వారధి బృందం కోరింది. ఈమేరకు జిల్లా కలక్టరేట్ లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ లో జనతా వారిది కో కన్వీనర్లు యానాపు ఏసు, బండి సత్యప్రసాద్, బొరుసు సుబ్రహ్మణ్యం, దాసరి ముత్యం, మండెల రాయుడు, కిషన్ మోర్చా నాయకులు పోతురాజు శ్రీనివాస్, అత్తిలి ఈశ్వర్, కొత్తపల్లి వెంకటేశ్ తదితర భాజపా నాయకులు వినతి పత్రం అందజేసారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యుల అందుబాటు, ఖాళీ పోస్టులు, మందుల నిల్వలను సమీక్షించి, టీకాలు, వ్యాధి నిర్ధారణ, అత్యవసర మొబైల్ వైద్య సేవలను బలోపేతం చేయాలని కోరారు. కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి, పశుగ్రాసం, దాణా, తాగునీటి సదుపాయాలు కల్పించాలని, అర్హులైన రైతులకు వర్తించే సబ్సిడీ పథకాల ప్రయోజనాలు అందించాలని కోరారు. పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. పశువుల మరణాలకు సంబంధించిన పెండింగ్ బీమా క్లెయిమ్‌లు, అర్హమైన పరిహార దరఖాస్తులను నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులో పరిష్కరించాలని కోరారు. గోకులం షెడ్లు--పథకాల మంజూరులో లోపాలపై విచారణ జరిపించి అర్హులకు అందేలా చూడాలని కోరారు. గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం దార్ల సమస్యలు పరిష్కరిం చాలని కోరారు. గొర్రెలు, పొట్టేళ్ల యూనిట్ల అమలులో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై విచారణ వేగవంతం చేయాలని కోరారు. తక్షణ సమస్యలను పరిష్కరించి, మిగిలిన వాటికి కాలపరిమితితో కూడిన కార్యాచరణ రూపొందించాలని కోరారు.

గిరిజన గ్రామాలన్నింటికీ రక్షిత తాగునీరే లక్ష్యం

- రూ.1.36 కోట్లతో తాగునీటి పథకాల నిర్మాణాలకు భూమిపూజ
- నాణ్యతతో పనులు వేగవంతంగా పూర్తి చేయాలి
- రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ అక్టోబర్ 12:గిరిజన గ్రామాలన్నింటికీ స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. సోమవారం రంపచోడవరం మండలంలోని పలు గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు పెంటపాటి అనంతమోహన్ ఆధ్వర్యంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా చేపట్టనున్న రక్షిత తాగునీటి పథకాల నిర్మాణాలకు ఆమె భూమిపూజ చేశారు. పెద్దగెద్దాడలో రూ.29.40 లక్షలు, చిన్నగెద్దాడలో రూ.24.10 లక్షలు, చెరువూరులో రూ.19.30 లక్షలు, ఐ.పోలవరంలో రూ.28.40 లక్షలు, తాటివాడలో రూ.35.10 లక్షలు కలిపి మొత్తం రూ.1.36 కోట్ల వ్యయంతో తాగునీటి పథకాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు స్వచ్ఛమైన తాగునీరు ఎంతో అవసరమన్నారు. ప్రతి గ్రామానికి రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. తాగునీటి ట్యాంకుల నిర్మాణంతో పాటు అంతర్గత పైపులైన్ల పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం, నాణ్యతా లోపాలు గుర్తిస్తే సంబంధిత వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పలు గ్రామాల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీతపల్లి దేవస్థానం ధార్మిక మండలి చైర్మన్ కారం బాపన్నదొర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీకా బుల్లికొండలుదొర, అడబాల బాపిరాజు, పండా చెల్లన్నదొర, కారం సింహాచలం, షేక్ శుభన్, కోసు నాగన్నదొర, వై.నిరంజనీదేవి, కారం శేషయమ్మ, తీగల ప్రభ, పండా వరలక్ష్మి, ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో గిరి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సురేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిఈసి జ్ఞానేష్ కుమార్, ఏ.పి సిఈసిల పై విచారణ జరపాలి

- రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్
- అధ్యక్షులు మేడా శ్రీనివాస్ డిమాండ్

రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 12:గత సాధారణ ఎన్నికల్లో కేంద్ర ముఖ్య ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ , ఆంధ్రరాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనాల అధికార దుర్వినియోగం పై విచారణ జరపాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్‌అధ్యక్షులు మేడా శ్రీనివాస్ డిమాండ్ చేసారు.

రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాల యంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కోరారు. అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ, మోదీ సర్కార్ కు, వాటి మిత్ర పక్షాలకు అధికారాన్ని హస్తగతం చేయాలనే కుట్ర కోణంలో ఓట్లను రకరకాలుగా దోచుకున్నారన్నారు. ఎన్నికల కుట్రలు విఫలం కాకుండా ఫారం -6, 7 లను జ్ఞానేశ్వర్ ఇష్టానుసారం ఉపయోగించి సుమారు 13 కోట్ల పైబడిన ఓట్లను కుట్ర పూరితంగా తొలగించారని ఆరోపించారు. 2023 లో ఎన్నికల చట్టం లోని సెక్షన్ 16 ను సంవరించి ఎన్నికల ముఖ్య అధికారి అవక తవకలకు పాల్పడినా అతని పై చర్యలు లేకుండా చట్టభద్రత కల్పించి జ్ఞానేష్ తో ఎన్నికల నేరాలు చేయించా రని ఆయన ఆరోపించారు. ఆంధ్రరాష్ట్రం లో ముఖ్య ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ జనసేన పార్టి కి మేలు కోసం అధికార దుర్వి నియోగానికి పాల్పడ్డా రన్నారు. దొడ్డి దారిలో విజయం సాధించిన రాజమండ్రి పార్లమెంట్ స్థానంపై ఏపి ఉన్నత న్యాయస్థానంలో దాఖలైన తన ఎలక్షన్ పిటిషన్ పై విచారణకు ఆదేశిస్తే ఎన్నికల నేరాలు, అధికార దుర్విని యోగ చర్యలు బయట పడతాయన్నారు. ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్డ్ అయిన రాజకీయ పార్టిలను విభజిస్తు, ప్రశ్నించే పార్టీలను ఎన్నికల సంఘం సమావేశాలకు దూరం చేస్తున్నారని విమర్శించారు. . గుర్తులు కేటాయింపుల్లో నిబంధనలకు అనుసరించక పోవడం వల్ల కొన్ని రాజకీయ పార్టిలకు నష్టం జరిగింద

న్నారు. 2024 ఎన్నికల్లో ముకేశ్ కుమార్ మీనా జారీ చేసిన సర్క్యులర్స్ పై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించా

లన్నారు.ఎన్నికల మోసాలను నేడు యువత భుజస్కం దాలపై వేసుకుని ఢిల్లీలో ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు ఉద్య మిస్తున్నారన్నారు. ప్రతి పౌరుడు ఓటును కాపాడుకునే ఆత్మగౌరవ పోరాటంలో భాగస్వాములు కావాలని "

మేడా పిలుపునిచ్చారు . జ్ఞానేశ్వర్ ఎన్నికల మోసాలు బహిర్గతం అయితే, ఈ వి ఎమ్ లను రద్దు చేసి బ్యాలెట్ ను ప్రవేశపెట్టాలన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రతిఘటించ ల్సిన ఓటు చోరిను యువత భుజాన్న ఎత్తుకోవటం బాదాకర మన్నారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ డి వి రమణమూర్తి , సిమ్మా దుర్గారావు , దుడ్డే సురేష్, వర్ధనపు శరత్ కుమార్ , వల్లి శ్రీనివాసరావు, కారుమూరి యుగంధర్ , గుడ్ల సాయి దుర్గా ప్రసాద్ , బసా సోనియా , వాడపల్లి జ్యోతిష్ , జవ్వాది మోహన్ , పాండ్రంగి ఈశ్వరరావు , త్రిపురాల పాండవులు , చల్లా శివ దుర్గా , శీతెన సురేష్ , పిట్టా శ్రీనివాసరావు, గరగ సురేష్ , కేశన హరిన్ కార్తీక్, మట్టపర్తి తులసి, డబ్బా కుమారి తదితరులు పాల్గొన్నారు

వీఆర్ఏలకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలి

- వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలి
- సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా విధులు అప్పగించొద్దు
- సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదు
- గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ హెచ్చరిక

గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ అక్టోబర్ 12:గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయడంతో పాటు అర్హులైన వారికి వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ డిమాండ్ చేశారు. సోమవారం రంపచోడవరం ఐటీడీఏ ఎదురుగా ఉన్న సీఐటీయూ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం, గ్రామ సేవకుల సంఘం (59/86--సీఐటీయూ) పోలవరం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ రహమాన్, పోలవరం జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వెంకట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించేందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నామినీలను వీఆర్ఏలుగా గుర్తించి వారికి న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ రహమాన్ మాట్లాడుతూ వీఆర్ఏలతో సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా విధులు నిర్వహింపజేయడం సరికాదన్నారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) ఆదేశాలను అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. అదనపు విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏలకు ప్రయాణ భత్యం (టీఏ), దినభత్యం (డీఏ) చెల్లించాలని డిమాండ్ చేశారు. పోలవరం జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ వీఆర్ఏల న్యాయమైన సమస్యల పరిష్కారానికి సీఐటీయూ నిరంతరం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం

సమావేశం అనంతరం సంఘం నాయకులు రంపచోడవరం సబ్ కలెక్టర్‌ను కలిసి వీఆర్ఏల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గ్రేడ్--2 వీఆర్వో పోస్టుల భర్తీకి సంబంధించి తహసీల్దార్ కార్యాలయాల నుంచి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు పంపాలని కోరారు. సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా అప్పగిస్తున్న విధులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని సంఘం నాయకులు తెలిపారు. పదోన్నతులకు సంబంధించిన సమాచారాన్ని సీసీఎల్ఏ కార్యాలయానికి పంపుతామని, వీఆర్ఏలతో సర్వీస్ రూల్స్ ప్రకారమే విధులు నిర్వహింపజేస్తామని, పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలను తక్షణమే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

వీఆర్ఏల సంఘం నూతన జిల్లా కమిటీ ఎన్నిక

ఈ సమావేశంలో పోలవరం జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సీఐటీయూ నాయకుడు వెంకట్, జిల్లా అధ్యక్షుడిగా కె. యోన, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేగల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా గడ్డం రవిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్. సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా సారపాటి వెంకటలక్ష్మి, ఉపాధ్యక్షులుగా కాపుల నాగేశ్వరరావు, మాచర్ల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. నూతన కమిటీ నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. వీఆర్ఏల హక్కుల పరిరక్షణకు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పోలవరం జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన గ్రామ రెవెన్యూ సహాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం

ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్

తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 12.తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్పెషల్ గ్రేడ్ కమిషనర్ ఎమ్. యేసుబాబు ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, ఆస్తి పన్ను, పారిశుధ్యం తదితర సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. కొన్ని ఫిర్యాదులపై వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

“ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరించి, ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యం. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూడాలి” అని కమిషనర్ యేసుబాబు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డి భవాని బాబు, మున్సిపల్ ఇంజనీర్ వై వెంకటరమణ ,అసిస్టెంట్ సిటీ ప్లానర్ జీ సీతారాం, మున్సిపల్ మేనేజర్ పి ప్రసాద్ రావు, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు మేనేజర్ నాగరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి వి జగదీశ్వర్ రావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

- ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు
- గ్రీవెన్స్‌కు 79, రెవెన్యూ క్లినిక్‌కు 15 దరఖాస్తులు
- మారుమూల గిరిజన గ్రామాల సమస్యలపై ప్రత్యేక దృష్టి
- రంపచోడవరం సబ్ కలెక్టర్ డి. పృథ్వి రాజ్ కుమార్

గంగవరం /రంపచోడవరం, అక్టోబర్ 12 :ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రంపచోడవరం సబ్ కలెక్టర్ డి. పృథ్వి రాజ్ కుమార్ తెలిపారు. ముఖ్యంగా పోలవరం జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో కలిసి సబ్ కలెక్టర్ డి. పృథ్వి రాజ్ కుమార్, ఏపీవో జనరల్ డి.ఎన్.వి. రమణ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన సమస్యల్లో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని, మరికొన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ వారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 79 దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్‌కు 15 దరఖాస్తులు కలిపి మొత్తం 94 అర్జీలు అందినట్లు వెల్లడించారు.

పిడతమామిడిలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలి

గంగవరం మండలం పిడతమామిడి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్, ఇంటర్నెట్ నెట్‌వర్క్ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, సామాన్య ప్రజలకు సమాచార వ్యవస్థ అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పిడతమామిడి గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని నిడమర్తి శ్రీను, జె. కాటమస్వామి, బి. సురేష్ కుమార్ వినతిపత్రం అందజేశారు.

గొడుగురాయిలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

వై.రామవరం మండలం గొడుగురాయి గ్రామంలోని దేవిగుడి వీధిలో నివసిస్తున్న 22 కుటుంబాలకు తాగునీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. తమ వీధిలో తాగునీటి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని చోడి బుల్లిదొర, కురుసం సుబ్బన్నదొర, బోడిదొర అధికారులకు అర్జీ సమర్పించారు.

నేలకోట ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి రహదారి, సాగునీరు కల్పించాలి

దేవీపట్నం మండలంలో పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన నేలకోట గ్రామ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని బాధితులు కోరారు. నేలకోట ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నుంచి పాత నేలకోట గ్రామం వరకు ఐదు కిలోమీటర్ల రహదారి నిర్మించాలని, సుమారు 50 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 18 సంవత్సరాల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి అర్హులైన వారికి పరిహారం మంజూరు చేయాలని చెదల నాగిరెడ్డి, కడబాల శ్రీనివాసరావు రెడ్డి, చెదల వెంకటరెడ్డి వినతిపత్రం అందజేశారు.

సూర్లవాడ కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తి చేయాలి

రంపచోడవరం మండలం సూర్లవాడ గ్రామంలో మధ్యలో నిలిచిపోయిన కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించాలని గ్రామస్తులు కోరారు. గ్రామ ప్రజల సామూహిక అవసరాలకు ఉపయోగపడే భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సాదల జగన్మోహన్ రెడ్డి, కుర్ల ఆదిరెడ్డి, సాదల ఎర్రరెడ్డి అధికారులకు దరఖాస్తు సమర్పించారు.

పూతిగుంట శివాలయాన్ని అభివృద్ధి చేయాలి

వై.రామవరం మండలం పూతిగుంట గ్రామంలోని పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పూతిగుంట నుంచి తోటకూరపాలెం గ్రామం వరకు మూడు కిలోమీటర్ల మేర బీటీ రహదారి నిర్మించాలని కోరారు. ఈ మేరకు బచ్చుల వెంకటరెడ్డి, కలిమెల నాగేశ్వరరావు, కలిమెల బాబురావు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించిన సబ్ కలెక్టర్ పృథ్వి రాజ్ కుమార్ సంబంధిత శాఖల అధికారులకు పంపించి పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ షేక్ అహ్మద్ శరీఫ్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్, ఉద్యాన శాఖ అధికారి దేవదానం, డీఎంహెచ్‌వో పి. సరిత, డీసీహెచ్‌ఎస్ సాంబశివరావు, పీహెచ్‌వో నరేంద్ర కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి దిల్షాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, రవికుమార్, జిల్లా ట్రెజరీ అధికారి కుమార్, పీఏవో ఎల్. రాంబాబు, సీపీవో వెంకటరావు, డిప్యూటీ తహసీల్దార్లు శ్రీధర్, రవీంద్రబాబు, శివ, శ్రీరామచంద్రమూర్తి, డీఈలు పి. వెంకటరమణ, చైతన్య, శివ, సుబ్బారావు, రమేష్, ఆర్టీవో రాజేష్ కుమార్, సబ్ రిజిస్ట్రార్ ఉపేంద్ర, ఐటీడీఏ ఏవో ఎర్రంశెట్టి రాజు, ఏపీఈపీడీసీఎల్ ఇంజనీర్ సాలెం రాజ్, డీపీఎం జి. నాగభూషణరావు, జీసీసీ డీఎం జయశ్రీ, తహసీల్దార్లు సీహెచ్ బాలాజీ, అమ్మాజీ, సరిత, సీహెచ్ శ్రీనివాసరావు, శివ, కరక సత్యనారాయణ, తేజస్విని, శ్రీరాములదొర, ఎంపీడీవోలు ప్రసాద్, బాపన్నదొర, సాల్మన్ రాజ్, లక్ష్మణరావు, కుమార్, యాదగిరి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీరంపాలెం శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠంలో 2 రోజు బ్రహ్మ చారిని రూపంలో దర్శనం



తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబరు 12.తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం గ్రామంలోని శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠం లో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో రెండవ రోజు అమ్మవారు బ్రహ్మ చారిని రూపంలో విశేష పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి మాట్లాడుతూ బ్రహ్మచారి నీ రూపాన్ని అర్థించడం ద్వారా ఇంద్రియ నిగ్రహం మనోత్సర్యం ఆత్మవిశ్వాసం కలుగుతుంది అన్నారు. పార్వతీదేవి పరమేశ్వరుని వివాహం చేసుకునే నిమిత్తం కఠోరమైన తపస్సు ఆచరించిన క్రమంలో బ్రహ్మచారినిగా దర్శనమిస్తారని బ్రహ్మచారి నీ దేవిని కుజ గ్రహానికి అధిపతిగా చెబుతూ కుజ గ్రహ దోషాలు ఈ అమ్మవారిని అర్చించడం ద్వారా నివృత్తి అవుతాయని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు తోపాటు విశేష హోమాలను సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో దాటిన శ్రీనివాస్ అలివేలు మంగతాయారు దంపతులు పోతుల అన్నవరం దంపతులు వానపల్లి వెంకటేశ్వరరావు కొండబాబు దంపతులు గారపాటి శ్రీనివాసరావు దంపతులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సామూహిక లలితా సహస్రనామ పారాయణులతో అమ్మవారికి విశేష సేవలు అందించారు.

శ్రీ విశ్వ దుర్గేశ్వరి అమ్మవారు గౌరీ దేవిగా అలంకరణ



తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 12. దేవి నవరాత్రుల సందర్భంగా ..తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్.. గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణంలో... 17వ వార్డు, విశ్వ దుర్గేశ్వరి పేటలో శ్రీ విశ్వ దుర్గేశ్వరి అమ్మవారి ఆలయం నందు రెండవ రోజు శ్రీ విశ్వ దుర్గేశ్వరి అమ్మవారిని గౌరీ దేవిగా తీర్చిదిద్దారు. అమ్మవారి ఆలయాన్ని ఎంతో సుందరంగా అలంకరించి వచ్చిన భక్తులందరికీ అమ్మవారు. దేదీప్యమానంగా, కనులు విందు చేసే విధంగా అమ్మవారు దర్శనమిస్తున్నారు. ఇంత చక్కగా భక్తులు దర్శించుకునే విధంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయం మొత్తాన్ని, గర్భగుడిని, ఉత్సవ విగ్రహం మండపాన్ని, పువ్వుల తో ఎంతో అందంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. పప్పల నాగ వెంకట అప్పారావు శ్రీమతి పుష్పలత, తాడి వెంకట నరసింహమూర్తి శ్రీమతి పద్మావతి దంపతులచే ప్రత్యేక పూజ కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు, భవానీలు పెద్ద సంఖ్యలో పాల్గొని, కుంకుమ పూజలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

వేసవి విజ్ఞాన తరగతులు - విద్యార్థులకు బహుమతులు అందజేసిన కమిషనర్.

తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 12.తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన తరగతులు,(సమ్మర్ ఒరియెంతషన్ ప్రోగ్రామ్) ముగింపు సందర్భంగా ఈరోజు విద్యార్థులకు బహుమతులు ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ ఎమ్. యేసుబాబు హాజర్రై, వేసవి విజ్ఞాన తరగతుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ యేసుబాబు మాట్లాడుతూ, పిల్లల్లో చిన్న వయస్సు నుండే పుస్తక పఠన అలవాటు పెంపొందించాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 28-04-2026 నుండి 06-06-2026 వరకు ఈ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధి

జీలుగుమిల్లి, పెన్ పవర్, అక్టోబర్ 12;ద్వారకాతిరుమల శ్రీ చిన్న వెంకన్న దేవస్థానం దత్తత ఆలయమైన ఐ.ఎస్. జగన్నాథపురం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన సుదర్శన హోమంలో జనసేన నాయకులు గడ్డమణుగు రవికుమార్, కరాటం సాయి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో మరింత అభివృద్ధి చెంది భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు ఆయురారోగ్యాలతో ఉండాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు విజయం సాధించాలని ఆకాంక్షించారు. పోలవరం నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. మహిమాన్వితమైన లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సుదర్శన హోమంలో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు వారు తెలిపారు.

మన్యం పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తా

పాలకొండ జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

చింతూరు, పెన్ పవర్, అక్టోబర్ 12:చింతూరు మన్యంలో పర్యాటక అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పాలకొండ జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. సోమవారం మోతుగూడెం, పొల్లూరు జలపాతాలు, పోర్‌బై డ్యామ్ ప్రాంతాలను సందర్శించి ప్రకృతి అందాలను పరిశీలించారు. అరకు, మారేడుమిల్లి తరహాలో చింతూరును ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రహదారులు, పర్యాటకుల భద్రత, గిరిజనులకు ఉపాధి అవకాశాలపై సంబంధిత అధికారులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఈ పర్యటనలో జనసేన చింతూరు మండల ప్రధాన కార్యదర్శి బేడే సతీష్, యువజన విభాగం నాయకులు మల్లిపూడి సతీష్, పయ్యల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక వాహనాల్లో ఆదివాసీ యువతకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి



- మారేడుమిల్లి టూరిజంలో గిరిజనుల ఉపాధి హక్కులను కాపాడాలి
- బొలెరో వాహనాల నిర్వహణలో స్థానిక యువతకు అన్యాయం సహించేది లేదు
- బెదిరింపులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- హక్కులను కాలరాస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం
- సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ హెచ్చరిక

గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ అక్టోబర్ 12 :మారేడుమిల్లి పర్యాటక ప్రాంతంలో సందర్శకులను తరలించే బొలెరో వాహనాల నిర్వహణలో స్థానిక ఆదివాసీ యువతకే తొలి ప్రాధాన్యం కల్పించాలని సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందుతున్నప్పటికీ స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాల్లో అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం రంపచోడవరం ఐటీడీఏలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సీపీఎం ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు ఉద్దేశించిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ, కమిటీ సభ్యులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి, సాధల విద్యాసాగర్, కంభం శాంతిరాజు మాట్లాడుతూ మారేడుమిల్లి మండలంలో పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ దాని ఫలాలు స్థానిక ఆదివాసీలకు అందడం లేదని విమర్శించారు. పర్యాటకులను సందర్శనీయ ప్రాంతాలకు తీసుకెళ్లే బొలెరో వాహనాల నిర్వహణలో గిరిజన యువత అనేక అడ్డంకులు, బెదిరింపులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఈ సమస్యలపై బాధిత యువకులు సీపీఎంను ఆశ్రయించడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

గిరిజనుల ఉపాధి హక్కులను పరిరక్షించాలి

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనుల హక్కుల పరిరక్షణకు ఉద్దేశించిన 1/70 చట్టం, పేసా చట్టాల స్ఫూర్తికి అనుగుణంగా స్థానిక ఆదివాసీల ప్రయోజనాలను కాపాడాలని నాయకులు డిమాండ్ చేశారు. పర్యాటకాన్ని నమ్ముకుని జీవిస్తున్న గిరిజన యువత ఉపాధిని దెబ్బతీసే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. మారేడుమిల్లిలో పర్యాటక వాహనాల నిర్వహణ, అనుమతులు, పర్మిట్ల కేటాయింపులో స్థానిక ఆదివాసీ యువతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పర్యాటక రంగంలో బయటి వ్యక్తులు, కాంట్రాక్టర్లకు ప్రాధాన్యం ఇస్తూ స్థానిక గిరిజన యువతను పక్కనపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లో లభించే ఉపాధి అవకాశాలు ముందుగా స్థానిక ఆదివాసీలకు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బెదిరింపులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి

పర్యాటక వాహనాలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆదివాసీ యువతను కొందరు బెదిరింపులకు గురిచేస్తున్నారని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఇటువంటి ఘటనలపై ఐటీడీఏ, పోలీసు, రవాణా శాఖ అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. గిరిజన యువతను అనవసరంగా ఇబ్బందులకు గురిచేయడం, అక్రమంగా కేసులు బనాయించే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందించాలి

పర్యాటక రంగం ద్వారా వచ్చే ఆదాయంలో స్థానిక గిరిజన కుటుంబాలకు తగిన వాటా దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. బొలెరోతో పాటు ఇతర పర్యాటక వాహనాల నిర్వహణలో ఆదివాసీ యువతకు అవకాశాలు కల్పించాలని, స్వయం ఉపాధి కోసం ముందుకొచ్చే యువతకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందించాలని సూచించారు. రవాణా రంగంలో గిరిజన యువత ఆర్థికంగా స్థిరపడేందుకు ఐటీడీఏ ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కోరారు.

అన్యాయం కొనసాగితే ఆందోళనలు ఉద్ధృతం

మారేడుమిల్లి పర్యాటక అభివృద్ధి పేరుతో స్థానిక ఆదివాసీల ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తే చూస్తూ ఊరుకోబోమని మట్ల వాణిశ్రీ హెచ్చరించారు. గిరిజనుల హక్కులను కాలరాసే చర్యలు కొనసాగితే సీపీఎం ఆధ్వర్యంలో ఆదివాసీలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసించే, వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరూ గిరిజనుల చట్టబద్ధమైన హక్కులను గౌరవించాలని కోరారు. ఆదివాసీ యువతకు న్యాయం జరిగే వరకు సీపీఎం ప్రాంతీయ కమిటీ అండగా ఉంటుందని తెలిపారు. పర్యాటక, ఐటీడీఏ, పోలీసు, రవాణా శాఖల అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి మండల బొలెరో అసోసియేషన్ యూనియన్ నాయకులు దూడ సందీప్ కుమార్, కంభం విజయ్ కుమార్, రమణ, సూరిబాబు, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త కొండమొదలు పంచాయతీని వెంటనే ఏర్పాటు చేయాలి

- నూతన పంచాయతీ ఏర్పాటు చేసే వరకు ఎన్నికలు నిలిపివేయాలి
- నిర్వాసితుల ఓట్ల విభజనపై గిరిజన సంఘాల ఆగ్రహం
- ఐటీడీఏ వద్ద ర్యాలీ, ధర్నా.. సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం

గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ అక్టోబర్ 12:పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు నివసిస్తున్న నేలదోనెలపాడు పునరావాస కాలనీని కొత్త కొండమొదలు నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని, అప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేయాలని ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు, కొండమొదలు పంచాయతీ మాజీ సర్పంచ్ వేట్ల విజయ డిమాండ్ చేశారు. సోమవారం ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో రంపచోడవరంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం ఐటీడీఏ ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద ధర్నా చేపట్టారు.
ఈ సందర్భంగా సంఘ నాయకులు వేట్ల విజయ, తాతి బుల్లబ్బాయి, కొండ్ల రామిరెడ్డి, వేట్ల శ్రీరాములు మాట్లాడుతూ దేవీపట్నం మండలం కొండమొదలు పంచాయతీకి చెందిన సుమారు 1,490 మంది ఆదివాసీలు పోలవరం ప్రాజెక్టు ముంపు కారణంగా గంగవరం మండలం జగ్గంపాలెం పంచాయతీ పరిధిలోని నేలదోనెలపాడు పునరావాస కాలనీకి తరలివచ్చారని తెలిపారు. ఐదేళ్లుగా అక్కడ నివసిస్తున్నప్పటికీ ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయకపోవడం అన్యాయమన్నారు.

ఓటర్ల విభజనతో నిర్వాసితులకు ఇబ్బందులు

పునరావాస కాలనీలోని 900 మందికి పైగా ఓటర్లలో 600 మందికి పైగా జగ్గంపాలెం పంచాయతీలో, మరో 340 మందికి పైగా 13 కిలోమీటర్ల దూరంలోని ఇందుకూరు పంచాయతీలో చేర్చడాన్ని నాయకులు తప్పుబట్టారు. ఒకే కాలనీలో నివసిస్తున్న ప్రజలను రెండు పంచాయతీలుగా విభజించడం వల్ల స్థానిక పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు 60 కిలోమీటర్ల దూరంలోని బడిగుంట గ్రామానికి చెందిన 75 మంది ఓటర్లను నేలదోనెలపాడు పోలింగ్ కేంద్రంలో చేర్చడం సరికాదన్నారు.

జీవో 63 ప్రకారం ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ జీవో నంబర్ 63 ప్రకారం పునరావాస కాలనీలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నూతన పంచాయతీ ఏర్పాటుకు సంబంధించి పంచాయతీరాజ్ అధికారులు, జిల్లా యంత్రాంగం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపినప్పటికీ నిర్ణయం తీసుకోకపోవడం విచారకరమన్నారు. ఇందుకూరు పంచాయతీ పోలింగ్ బూత్ నంబర్ 192లో ఉన్న 340 మందికి పైగా నిర్వాసితుల ఓట్లను కొత్త కొండమొదలు పోలింగ్ బూత్ నంబర్ 193కు మార్చాలని కోరారు. అలాగే బడిగుంటకు చెందిన 75 మంది ఓటర్లను తున్నూరు పంచాయతీలోని మామిడివలస పోలింగ్ కేంద్రానికి మార్చాలని డిమాండ్ చేశారు. దేవీపట్నం మండలంలోని ఆరు పంచాయతీలను పునర్వ్యవస్థీకరించాలని కోరారు.

సబ్ కలెక్టర్ హామీతో ధర్నా విరమణ

ఈ సమస్యలను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఉద్దేశించిన వినతిపత్రాన్ని సమర్పించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో రంపచోడవరం సబ్ కలెక్టర్ ధర్నా వద్దకు వచ్చి వినతిపత్రాన్ని స్వీకరించారు. కొత్త కొండమొదలు పంచాయతీ ఏర్పాటుపై కలెక్టర్‌తో చర్చించి సమాచారం అందిస్తామని హామీ ఇవ్వడంతో నాయకులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలీ సంఘం నాయకులతో పాటు జగ్గంపాలెం పంచాయతీ గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, నిర్వాసితులు పాల్గొని మద్దతు తెలిపారు.

ఆరుగొలనులో వైభవంగా విజయదుర్గ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

145 మంది కళాకారులతో అమ్మవారి ఊరేగింపు.. కనులవిందుగా సాంస్కృతిక ప్రదర్శనలు

తాడేపల్లిగూడెం. పెన్ పవర్, అక్టోబర్ 12:తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామంలో కొలువైన విజయదుర్గ అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారు స్వర్ణకవచాలంకృత కనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు, సంప్రదాయ కళారూపాలతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఉదయం కలశస్థాపన, తులసి పూజ, హోమం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, గ్రామ మాజీ సర్పంచ్ నూకల బుల్లియ్య, నూకల ధనకృష్ణ సోదరుల ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. సుమారు 145 మంది కళాకారులు పాల్గొన్న ఈ ఊరేగింపులో గరగల నృత్యాలు, కాళీ మహాకాళి వేషధారణలు, బోనాల నృత్యాలు, గొర్రెలాన్ తదితర సంప్రదాయ కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారుల ప్రదర్శనలు, భక్తుల జయజయధ్వానాల మధ్య సాగిన అమ్మవారి ఊరేగింపు గ్రామస్థులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు కిటకిటలాడగా, ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభంతో ఆరుగొలను గ్రామంలో పండుగ శోభ సంతరించుకుంది. దసరా ఉత్సవాల్లో భాగంగా రాత్రి నిర్వహించిన బాణసంచా ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆకాశంలో రంగురంగుల వెలుగులు విరజిమ్మడంతో పండుగ వాతావరణం మరింత సందడిగా మారింది.

రాజకీయ పార్టీలలో మున్సిపల్ ఎన్నికల వేడి

కొవ్వూరు, పెన్ పవర్, అక్టోబర్ 12:మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్స్ ఖరారు కావడంతో పలు రాజకీయ పార్టీలలో హడావిడి మొదలైయ్యింది. ప్రధానంగా కొవ్వూరు మున్సిపాలిటీలో ప్రధాన పార్టీల మధ్య పోరు ప్రత్యక్షంగా కనబడుతుంది. మునిసిపల్ చైర్మెన్ పదవి బీసీ మహిళకు కేటాయించడంలో ప్రధాన పార్టీలు సమర్ధులైన అభ్యర్ధులకోసం జల్లెడ పడుతున్నాయి. వైసీపీ నుండి బరిలోకి ఏలూరి విజయలక్ష్మి రానున్నట్లు సమాచారం. మాజీ హోమ్ మంత్రి తానేటి వనిత నేతృత్వంలో టౌన్ మహిళా అధ్యక్షురాలుగా, నేటి తలారి వెంకట్రావు నేతృత్వంలో మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఏలూరి విజయలక్ష్మి పనిచేస్తున్నారు. బీసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగా పనిచేసిన విజయలక్ష్మి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి దగ్గర నుండి క్రిందిస్థాయి నాయకులవరకూ అందరికి సుపరిచితమే. సామాజికంగాను, అటు రాజకీయంగాను, ఆర్ధికంగాను పలుకుబడి ఉన్న విజయలక్ష్మి ప్రస్తుతం వైసీపీకి మునిసిపల్ ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా మారనున్నారని వినికిడి.

న్యాయవాదులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

పి.వి.బి రాజు ఆధ్వర్యంలో న్యాయవాదుల రిలే దీక్షలు

రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 12: న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని,న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రాజమండ్రి బార్ అసోసియేషన్ హాలు వద్ద సోమవారం న్యాయవాదులు రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. వైసీపీ లీగల్ సెల్ మాజీ ప్రధాన కార్యదర్శి పి.వి.వి.ఎస్.బి.రాజు ఆధ్వర్యంలో ఈ రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాది రాజు మీడియా తో మాట్లాడుతూ న్యాయవాదు లపై దాడులు జరగడం ఆందోళన కలిగిస్తోందని, ఇటీవల కాకినాడకు చెందిన న్యాయవాది కె.వి.వి.ఎస్.ఎన్. మూర్తిపై ప్రతిపక్ష కక్షిదారులు దాడి చేయడం దారుణమని ఆవేదన చెందారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయవాదుల రక్షణకు చట్టం చేశారని, ఆంధ్రప్రదేశ్ లో కూడా చట్టం చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, న్యాయశాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్ చొరవ చూపి వచ్చే శీతాకాల సమావేశాల్లో చర్యలు చేపట్టాలని కోరారు. జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ ఇవ్వాలని, న్యాయవాదుల కోసం రూ. 100 కోట్లతో నిధి ఏర్పాటు చేయాలని రాజు డిమాండ్ చేశారు. ఈరిలే నిరాహార దీక్షలు శుక్రవారం వరకు కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఈ రిలే నిరాహారదీక్షలో న్యాయవాదులు సాధిక్ హుస్సేన్,సీహెచ్ చినబాబు,గుల్ల ఏడుకొండలు, రూప రాజేశ్వరి, చెరుకూరి రామారావు చౌదరి, బత్తుల రాజు,కె.రాజు,పిల్లి నాగిని రమ్య తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ప్రజా వేదికలో 28 అర్జీలు

రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 12:ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించగా.. మొత్తం 28 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకి 2, టౌన్ ప్లానింగ్ కి 12, ఇంజనీరింగ్ కి 4, వార్డు సచివాలయాలకు 2, పబ్లిక్ హెల్త్ కి 3, హౌసింగ్ కి 3, అకౌంట్స్ విభాగానికి 1, మెప్మాకు ఒకటి ఉన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి పారదర్శకంగా విచారణ జరిపలన్నారు. ఫిర్యాదులను జీరో స్థాయికి తీసుకురావాలని సూచించారు. ప్రతీ అర్జీకి సరైన ఎండార్స్ మెంట్ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ ఎండి అబ్దుల్ మలిక్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన మహిళా చిరు వ్యాపారులకు

సాపిడి సంస్థ ఆర్థిక సహాయం

చింతూరు, పెన్ పవర్ అక్టోబర్ 12: చింతూరు కేంద్రంగా పనిచేస్తున్న సాపిడి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గిరిజన మహిళల ఆర్థిక అభివృద్ధికి చేయూత అందించారు. చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న 21 మంది గిరిజన మహిళలను గుర్తించి, ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.4.20 లక్షల ఆర్థిక సహాయం అందించారు. మహిళలు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకొని ఆర్థికంగా స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అదేవిధంగా ఇంటి ఆవరణలో కూరగాయలు పండించుకునేందుకు 12 రకాల కూరగాయల విత్తనాలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ ఎస్.కె. అహ్మద్ అలీ, ఆర్గనైజర్లు జానకి, లక్ష్మి, నాగరాజు, కీర్తి, అంజలి, అశ్విని పాల్గొన్నారు.

గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు

- భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రి ఉత్సవాలు
- వేదమంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు
- నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ పిలుపు

గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 12:గంగవరం మండల కేంద్రంలోని శ్రీశ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దివ్య అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఆలయ పురోహితులు శ్రీ వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని గాయత్రీ దేవిగా సర్వాంగసుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గాయత్రీ దేవి రూపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకొని భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

దేవీ నవరాత్రుల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. జగన్మాతను భక్తిశ్రద్ధలతో ఆరాధించడం ద్వారా ఆధ్యాత్మిక చింతన, మనశ్శాంతి కలుగుతాయని పేర్కొన్నారు. గాయత్రీ దేవిని జ్ఞానానికి, వివేకానికి, ఆధ్యాత్మిక శక్తికి ప్రతీకగా భక్తులు ఆరాధిస్తారని వివరించారు.తొమ్మిది రోజులపాటు నిర్వహించే దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. గంగవరం మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అంతరాష్ట్ర నేరస్తుడు అరెస్టు

రూ.53.51 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

రాజమహేంద్రవరం పెన్ పవర్ అక్టోబర్ 12:రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 65 కేసుల్లో ఉండి నమోదయి నేర జీవితాన్ని కొనసాగిస్తున్న అంతర్ రాష్ట్ర పగటి దొంగతనాల నేరస్థుడు మిక్కిలి వంశీకృష్ణ అలియాస్ శ్యామ్ రిచర్డ్ ను ప్రకాష్ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన నేరస్థుడు చేసిన దొంగతనం, చోరీ సొత్తు వివరాలను స్థానిక ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ లో సెంట్రల్ జోన్ ఏ ఎస్పి డాక్టర్ తరుణ్ పవ్యా, సర్కిల్ ఇన్స్పెక్టర్ బాజీ లాల్ సోమవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈనెల 7వ తేదీన స్థానిక నారాయణపురం లో నివాసముంటున్న పోలవరపు వెంకట ధర్మరాజు నివాసంలో పగటి సమయంలో సుమారు 410 గ్రాముల బంగారం ఆభరణాలు, 90 గ్రాముల వెండి ఆవరణాలు వంశీకృష్ణ దొంగతనం చేశాడన్నారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఏఎస్పీ డాక్టర్ తరుణ్ తరుణ్ పహా ఆధ్వర్యంలో సిఐ బాజీలాలు, ఎస్ ఐ లు సతీష్ , నవీన్ కుమార్, కానిస్టేబుల్లు నాగరాజు, కే ప్రదీప్, వీరబాబులతో ప్రత్యేక బృందాలను చేసినట్లు తెలిపారు. మీరు దర్యాప్తులో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సాయంత్రం అనుమానస్పదంగా తిరుగుతున్న వంశీకృష్ణ అరెస్టు చేసి అతని వద్ద నుంచి చోరీ సొత్తు 410 గ్రాములు బంగారం ఆభరణాలు , 90 గ్రాముల జత పట్టీలు వాటి విలువ 53,50 రూపాయల ఉంటుందని సీఐ బాజిలాల్ తెలిపారు. మీద హైదరాబాద్ కూకట్పల్లి నగర్ ఎల్బీనగర్ నర్సింగి సరూర్నగర్ ఖమ్మం బేగంపేట టమాట చీరాల 1,2 కే సుమారు 65 పోలీసు కేసులు నమోదు ఉన్నాయన్నారు చాలాసార్లు జైలుకు వెళ్లి శిక్షలు అనుభవించాడన్నారు. 4 రోజుల్లో కేసును చేదించడంలో ప్రతిభ కనపరిచిన పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అడిషనల్ ఎస్పీ లు అభినందించి రివార్డులు అందజేశారు. ప్రజలు బయట వాళ్లకు వెళ్లేటప్పుడు పోలీస్ శాఖ అందిస్తున్న పోలీస్ శాఖ ఉచితంగా అందిస్తున్న ఎల్ హెచ్ ఎం ఎస్ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఏ కేసుల్లోనూ రాజీ పడలేదు

మీడియా సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు వాసిరెడ్డి బాబి వెల్లడి

రాజమహేంద్రవరం పెన్ పవర్ అక్టోబర్ 12:గత నెలలో ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మోడల్ కాలనీలో ఒక అపార్ట్మెంట్లో పరస్పర కేసుల్లో తాను రాజీ పడలేదని తెలుగుదేశం పార్టీ నాయకుడు వాసిరెడ్డి బాబి స్పష్టం చేశారు. స్థానిక సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఆనాటి ఘటన అనుకోకుండా జరిగిందని కొట్లాటలో బాధితులు, నిందితులు వ్యక్తిగతంగా తెలియదని, అక్కడ తనను రామదాసు వాచ్మెన్ అనుచరులు దుర్భాషలు ఆడడంతో ఆవేశానికి లోనై కొట్టడం జరిగిందన్నారు. దాంతో తనపై ఎస్సీ ఎస్టీ కేసు, కొట్లాట కేసు రెండు ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్లో నమోదయ్యాన్నారు. తన పైన, తన అనుచరుని పైన దాడి చేసిన రామదాసు పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా తనపై రాజ్యాంగేతర శక్తిగా ,అసాంఘిక శక్తిగా , రౌడీయిజం చేసే వ్యక్తిగా, మద్యం, ఇసుక వ్యాపారాల్లో పాల్గొంటున్నట్లు, అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలకు ఆర్థిక లావాదేవీలు నడుపుతున్నట్లు షాడో ఎమ్మెల్యేగా భరిస్తున్నారని, వైసిపి నాయకులతో అంటకాగుతున్నట్లు, కేసు రాజీ పడినట్లు జరుగుతుందన్న దుష్ప్రచారాన్ని ఖండించారు. ఎవరైనా ఆరోపణలు చేసే ముందు సాక్షాదారాలతో ముందుకు వస్తే తాను స్పందిస్తానన్నారు. అయితే తెలుసో తెలియకో ఎవరి మనోభావాలు దెబ్బతినుంటే తాను క్షమాపణలు చెబుతున్నానన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ లోని ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కారం

రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ 12:రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న “ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి.నరసింహ కిషోర్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలని తెలుసుకుని, వెనువెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి, ఫిర్యాదిదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు ఎస్పీ(అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్ పలు పిటిషన్లను పరిశీలించి, బాధితులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకొన్నారు. సోమవారం పోలీసు “పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం” కార్యక్రమానికి 20 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు కలవు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

నియోజకవర్గంలో 17 కోట్ల 79 లక్షల 50 వేలతో రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం!

తాడేపల్లిగూడెం. పెన్ పవర్, అక్టోబర్ 12.తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధికి మరో ముందడుగుగా, గ్రామీణ రహదారుల అభివృద్ధి మరియు హౌసింగ్ కాలనీలకు మెరుగైన రవాణా సదుపాయాల కల్పన లక్ష్యంగా ఏపీ ఆర్ ఆర్ ఎస్ పి, సాఎఎస్సి ఐ, గ్రాంట్లు మరియు ఇతర నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సోమవారం, న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ఉ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొని పలు రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మొత్తం అంచనా వ్యయం: ?17,79,50,000 (17 కోట్ల 79 లక్షల 50 వేల రూపాయలు). ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతు తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే మా ప్రధాన లక్ష్యం. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, హౌసింగ్ కాలనీలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రజల ప్రయాణ ఇబ్బందులను తగ్గించి, గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తాం. అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలను అందించడం, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడం కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, గౌరవ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు కూటమి ప్రభుత్వ సహకారంతో తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాం. నాణ్యమైన రహదారుల నిర్మాణం, గ్రామీణ మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనుల అమలుకు ప్రాధాన్యత ఇస్తాం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు, జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్య మెరుగైన రహదారులతో తాడేపల్లిగూడెం ప్రగతికి బాటలు బొలిశెట్టి శ్రీనివాస్ అని అన్నారు.

35 కేజీల గంజాయిస్వాధీనం ఇద్దరు నిందితులు అరెస్ట్

రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 12:తూర్పుగోదావరి జిల్లా, రూరల్ పరిధిలోని గామన్ బ్రిడ్జి సమీపంలో, గండి పోచమ్మతల్లి ఆలయం ఎదురుగా, రాజానగరం నుంచి కొవ్వూరు వెళ్లే మార్గంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతు న్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, త్రి టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వి. అప్పారావు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను పట్టుబడ్డారు. వారిలో ప్రకాశం జిల్లా, కొండపి మండలం, కట్టవారిపాలెం గ్రామానికి చెందిన రావూరి (38), కోరుకొండ రోడ్డులోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయం ఎదురుగా నివాసం ఉండి, ప్రస్తుతం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, కెపిహెచ్బి ఫేజ్–2 పబ్లిక్ పార్క్ సమీపంలోని బాలుర హాస్టల్‌లో ఉంటున్న గణేష్ నగర్ వాసి పాచిక్ల క్రాంతి కుమార్ (27) లను అరెస్టు చేశామన్నారు.వారి వద్ద రెండు బ్యాగుల్లోని 35.100 కేజీల గంజాయిని, దాని విలువ సుమారు రూ.17,55,000/- స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా, రాజేంద్ర వద్ద నుంచి సెల్‌ఫోన్, రూ.500/- నగదును, క్రాంతి కుమార్ నుంచి 2 సెల్‌ఫోన్లు రూ.300/- నగదును,ఏపీ-05-ఈడి-2048 నంబరు గల ఎరుపు రంగు ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం . చేసుకున్నా మన్నారు. విచారణలో, నిందితులు ఒడిశా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గుర్తుతెలియని వ్యక్తి వద్ద కిలో గంజాయిని కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయించడంతో పాటు తమ వ్యక్తిగత వినియోగం కోసం తీసుకువస్తున్నట్లు వెల్లడైందన్నారు .ఈ గంజాయి సేకరణకు కుమ్మరిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి మాదాల వెంకటేశ్వరరావు నిందితులను పంపినట్లు సిఐ తెలిపారు. ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఇద్దరి ముద్దాయిలను మెజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చగా రిమాండ్ విధించారు. ఈ కేసులో ప్రతిభ కనబర్చిన సి ఐ వి. అప్పారావు, ఎస్ ఐ వి అప్పలరాజు, సిబ్బంది వి కృష్ణ హెడ్ కానిస్టేబుల్, యస్ చంద్ర శేఖర్ , హెడ్ కానిస్టేబుల్, కె పవన్ కుమార్ , కానిస్టేబుల్, జె అర్జున రాజు , కానిస్టేబుల్ లను తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ అభినందించారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు. యువత గంజాయి వంటి మాదకద్ర వ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి అక్రమ రవాణా గురించి సమాచారం తెలిసినవారు పోలీసులకు తెలియజేసి గంజాయి రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

పండగ పూట పస్తులేనా..?

- రాష్ట్రవ్యాప్తంగా జీతాల చెల్లింపు.. పోలవరం జిల్లాలోనే ఎందుకీ నిర్లక్ష్యం?
- రెండు నెలలుగా వేతనాల కోసం సమగ్ర శిక్ష ఉద్యోగుల ఎదురుచూపులు
- చాలీచాలని జీతాలు.. అవీ అందక కుటుంబాల ఆర్థిక అవస్థలు
- పండగ వేళ పూట గడవడమే కష్టమంటున్న చిరుద్యోగులు
- ఆగస్టు, సెప్టెంబర్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్

గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 12:రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు చెల్లించినప్పటికీ పోలవరం జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులకు మాత్రం రెండు నెలలుగా జీతాలు అందకపోవడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. పండగ వేళ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాల్సిన ఉద్యోగులు వేతనాల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. చాలీచాలని జీతాలతో అరకొర జీవితాలు గడుపుతున్న చిరుద్యోగులకు ఆ వేతనాలు కూడా సకాలంలో అందకపోవడంతో కుటుంబ పోషణ ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల ఉద్యోగులకు వేతనాలు చెల్లించిన అధికారులు పోలవరం జిల్లా ఉద్యోగుల విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

రెండు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూపులు

పోలవరం జిల్లాలో సమగ్ర శిక్ష పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన వేతనాలు ఇప్పటికీ అందలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెలా వచ్చే జీతంపైనే ఆధారపడి జీవించే ఉద్యోగులకు వరుసగా రెండు నెలల వేతనాలు నిలిచిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తీవ్రమయ్యాయని వాపోతున్నారు. కుటుంబ అవసరాలు, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, నిత్యావసర సరుకులు, వైద్య ఖర్చులు భరించలేక సతమతమవుతున్నామని చెబుతున్నారు. ఒక నెల జీతం ఆలస్యమైనా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల్లో రెండు నెలలుగా వేతనాలు అందకపోవడం తమ కుటుంబాలను మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రానికో న్యాయం.. పోలవరం జిల్లాకో న్యాయమా?

రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు చెల్లించినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. అయితే పోలవరం జిల్లాలో మాత్రం జీతాలు పెండింగ్‌లో ఉండటంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఒకే శాఖ పరిధిలో పనిచేస్తూ ఒకే విధమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల విషయంలో జిల్లాలవారీగా ఈ వ్యత్యాసం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇతర జిల్లాల్లో వేతనాల చెల్లింపు ప్రక్రియ పూర్తయినప్పుడు పోలవరం జిల్లాలో ఎందుకు జాప్యం జరుగుతోందో సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. వేతనాల విడుదలలో సాంకేతిక సమస్యలు ఉన్నాయా? పరిపాలనాపరమైన కారణాలు ఏమైనా ఉన్నాయా? లేక అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమా? అనే అంశాలపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

పండగ ఆనందం ఎక్కడ?.. కుటుంబాల్లో ఆవేదన

పండగ అంటే ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలి. కొత్త బట్టలు, పండగ సామగ్రి, కుటుంబ అవసరాలతో ఇళ్లన్నీ సందడిగా ఉండాలి. కానీ పోలవరం జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల కుటుంబాల్లో మాత్రం వేతనాల కోసం ఎదురుచూపులే మిగిలాయని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. పండగ సమీపిస్తున్నా చేతిలో డబ్బులు లేక కుటుంబ సభ్యుల కనీస అవసరాలు కూడా తీర్చలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. పిల్లలకు పండగ దుస్తులు కొనుగోలు చేయాలన్నా, ఇంటికి అవసరమైన సరుకులు తెచ్చుకోవాలన్నా ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. నెల తరబడి విధులు నిర్వర్తిస్తున్నా సకాలంలో వేతనాలు అందకపోవడం బాధాకరమని పేర్కొంటున్నారు.

చాలీచాలని జీతాలు.. అవులే ఆధారం!

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న పలువురు చిరుద్యోగులు ఇప్పటికే తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, విద్య, వైద్య ఖర్చుల నేపథ్యంలో నెలవారీ జీతంతో కుటుంబాన్ని నెట్టుకురావడమే కష్టంగా మారిందని చెబుతున్నారు. అటువంటి పరిస్థితుల్లో రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో జీతాలు అందకపోవడం వల్ల కుటుంబ ఆర్థిక ప్రణాళిక పూర్తిగా దెబ్బతింటోందని పేర్కొంటున్నారు.

విధుల్లో బాధ్యత.. వేతనాల్లో నిర్లక్ష్యమా?

విద్యారంగ అభివృద్ధికి సంబంధించిన సమగ్ర శిక్ష కార్యక్రమాల అమలులో ఉద్యోగులు తమ వంతు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని, అయినప్పటికీ వేతనాల విషయంలో నిర్లక్ష్యానికి గురవుతున్నామని ఉద్యోగులు అంటున్నారు. విధులకు హాజరుకావడం, అప్పగించిన పనులను పూర్తి చేయడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తున్న తమకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగుల నుంచి విధుల నిర్వహణలో జవాబుదారీతనం ఆశించే అధికారులు, వారి వేతనాల చెల్లింపులోనూ అదే బాధ్యతను ప్రదర్శించాలని కోరుతున్నారు.

అధికారుల మౌనం వీడేదెప్పుడు?

రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని ఉద్యోగులు కోరుతున్నారు. వేతనాల చెల్లింపులో జాప్యానికి గల కారణాలను వెల్లడించడంతో పాటు సమస్య పరిష్కారానికి నిర్దిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు రాష్ట్ర స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని పెండింగ్ వేతనాల విడుదలకు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇతర జిల్లాల్లో వేతనాలు అందుతున్నప్పుడు పోలవరం జిల్లాలో మాత్రమే ఈ పరిస్థితి ఎందుకు కొనసాగుతోందో సమీక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

పండగ వేళనైనా జీతాలు చెల్లించండి!

పండగ సమయంలోనైనా పెండింగ్‌లో ఉన్న ఆగస్టు, సెప్టెంబర్ నెలల వేతనాలను విడుదల చేసి తమ కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. రెండు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగుల పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించాలని కోరుతున్నారు. ఇకపై ప్రతినెలా నిర్ణీత సమయంలో జీతాలు అందేలా శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగుల ఆవేదనకు సమాధానం చెప్పేదెవరు?

రాష్ట్రవ్యాప్తంగా వేతనాలు చెల్లించినట్లు ఉద్యోగులు చెబుతున్న నేపథ్యంలో పోలవరం జిల్లాలోనే జీతాలు ఎందుకు నిలిచిపోయాయన్న ప్రశ్నకు సంబంధిత అధికారుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ఉద్యోగుల శ్రమకు ప్రతిఫలంగా అందాల్సిన వేతనాలు సకాలంలో చెల్లించడం కనీస బాధ్యత. పండగ వేళ ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పరిస్థితుల్లో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. రెండు నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు పండగలోపైనా వేతనాలు అందుతాయా? లేక ఈసారి కూడా పండగను ఆర్థిక ఇబ్బందుల మధ్యే గడపాల్సి వస్తుందా? అన్నది ఇప్పుడు ఉద్యోగుల కుటుంబాలను వేధిస్తున్న ప్రశ్న.

హెల్త్ సెక్రటరీలు, ఏఎన్ఎంల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ సెక్రటరీలను పూర్తిగా విలీనం చేయాలి
- సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి
- యాప్‌ల భారం తగ్గించి.. ఫీల్డ్ సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలి
- ఎస్టీ బ్యాక్‌లాగ్ పదోన్నతులు కల్పించాలని డిమాండ్
- యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ వినతి

గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ అక్టోబర్ 12: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలు, ఏఎన్ఎంలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రంపచోడవరం ఐటీడీఏ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు అనంతరం సబ్ కలెక్టర్కు వినతి పత్రాన్ని అందజేశారు . ఉద్యోగుల పదోన్నతులు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, యాప్‌ల పనిభారం తగ్గింపు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ సమర్పించారు. ఉద్యోగుల సమస్యలపై ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు అందజేయడంతో పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడం విచారకరమని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్య ఆరోగ్య శాఖలో పూర్తిస్థాయిలో విలీనం చేయాలి

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలను పూర్తిస్థాయిలో వైద్య ఆరోగ్య శాఖలో విలీనం చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజలకు క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్న హెల్త్ సెక్రటరీలు, ఏఎన్ఎంలు పరిపాలనాపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వీటిని పరిష్కరించి ఉద్యోగులకు స్పష్టమైన విధివిధానాలు అమలు చేయాలని కోరారు.

యాప్‌ల భారంతో ఉద్యోగుల సతమతం

వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులపై రోజురోజుకూ పెరుగుతున్న యాప్‌ల పనిభారాన్ని తగ్గించాలని కోరారు. ఆర్సీహెచ్, అనోల్, యూ-విన్ తదితర యాప్‌లలో ఒకే సమాచారాన్ని పలుమార్లు నమోదు చేయాల్సి వస్తోందని, దీనివల్ల క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఒకే డేటాను వివిధ యాప్‌లలో నమోదు చేసే విధానానికి స్వస్తి పలికి, అన్ని వివరాలను ఒకే యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్సీహెచ్ యాప్ తరహాలో నమోదైన సమాచారాన్ని సవరించేందుకు ఎడిట్, డిలిట్ ఆప్షన్లు కల్పించాలని కోరారు.

సర్వేల్లో ఓటీపీ స్కిప్ విధానం అమలు చేయాలి

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ సర్వేల్లో ఓటీపీ స్కిప్ విధానాన్ని అమలు చేయాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. యూ-విన్ యాప్‌లో ఉన్న విధంగా ఇతర సర్వేల్లోనూ ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు, సాంకేతిక ఇబ్బందుల నేపథ్యంలో ఓటీపీ ఆధారిత నమోదు ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

జాతీయ కార్యక్రమాల్లో టార్గెట్ల విధానం తొలగించాలి

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో లక్ష్యాల ఆధారిత విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులపై లక్ష్యాల సాధన పేరుతో అదనపు ఒత్తిడి పెడుతుండడం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అనువైన పని వాతావరణాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఫీల్డ్ సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) హాజరు విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు వివిధ ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు అందించాల్సి ఉంటుందని, ఈ నేపథ్యంలో ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానంతో ఎదురయ్యే ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఎస్ రద్దు.. ఓపీఎస్ పునరుద్ధరణ

ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల పదవీ విరమణ అనంతర ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఎస్టీ బ్యాక్‌లాగ్ పదోన్నతులు కల్పించాలి

వైద్య ఆరోగ్య శాఖలో ఆగిన్ కేడర్లకు సంబంధించిన ఎస్టీ బ్యాక్‌లాగ్ పదోన్నతులను కల్పించాలని యూనియన్ నాయకులు కోరారు. పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను కారణంగా చూపుతూ పదోన్నతులను నిలిపివేయడం సరికాదని పేర్కొన్నారు. నిబంధనలకు అనుగుణంగా పదోన్నతుల ప్రక్రియను చేపట్టి అర్హులైన ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నిసార్లు విన్నవించినా పరిష్కారం లేదా?

ఉద్యోగుల సమస్యలపై ఇప్పటికే అనేకసార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేయడంతో పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఆశించిన పరిష్కారం లభించలేదని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి నెలకొంటోందని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను జిల్లా కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. హెల్త్ సెక్రటరీలు, ఏఎన్ఎంల సమస్యల పరిష్కారంతో పాటు పదోన్నతులు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, యాప్‌ల పనిభారం తగ్గింపు వంటి తొమ్మిది ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పి సత్యవతి, ప్రధాన కార్యదర్శి దుర్గారావు, కోశాధికారి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం మెరుగుపడుతుంది.

గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 09 పెన్ పవర్.మండలంలో లోవముఠా ప్రాంతం వనకాబడి పంచాయతీ పరిధిలోని దేరువాడ ఆర్.అండ్.బి రోడ్డు నుంచి పాములగినొడ గ్రామం వరకు సుమారుగా.2.99 కోట్ల నిధులతో 9.008 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న బీటీ రహదారి పనులకు సోమవారం నాడు ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు,ప్రయాణ సమయం తగ్గి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.ముఖ్యంగా గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలకు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తగ్గనున్నాయి.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కురుపాం ఏఎంసీ వైస్‌చైర్మన్ కద్రక కళావతి,అరసబిల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం ట్రస్ట్ సభ్యులు పెంటపాటి భారతి,మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్,కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాచ్‌ల వేటలో తిలక్ వర్మ అరుదైన రికార్డు.. భారత క్రికెటర్లలో టాప్!

- టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో తిలక్ వర్మ అరుదైన ఘనత
- ఫీల్డర్‌గా 50 క్యాచ్‌లు అందుకున్న ఐదో భారత ఆటగాడు
- కేవలం 68 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనే 50 క్యాచ్‌లు
- ప్రతి ఇన్నింగ్స్‌కు సగటున 0.757 వికెట్లను క్యాచ్‌ల రూపంలో అందించిన తిలక్
- 0.767 నిష్పత్తితో తిలక్ కంటే ముందున్న యూఏఈ ప్లేయర్ వసీమ్

హైదరాబాద్ పెన్ పవర్: భారత యువ బ్యాటర్ తిలక్ వర్మ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. ఫీల్డర్‌గా 50 క్యాచ్‌లు అందుకున్న ఐదో భారత ఆటగాడిగా నిలిచాడు. అంతేకాదు.. ఈ మైలురాయిని అత్యంత సమర్థంగా చేరుకున్న భారత ఫీల్డర్‌గా రికార్డు సృష్టించాడు. వెస్టిండీస్‌తో ఆదివారం ఇండోర్‌లో జరిగిన మూడో టీ20లో ఈ ఘనత అందుకున్నాడు.

68 మ్యాచ్‌ల్లోనే 50 క్యాచ్‌లు

తిలక్ వర్మ కేవలం 68 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనే 50 క్యాచ్‌లు పట్టాడు. ప్రతి ఇన్నింగ్స్‌కు సగటున 0.757 వికెట్లను క్యాచ్‌ల రూపంలో అందించడంలో అతడు ముందున్నాడు. కనీసం 50 ఔట్‌ఫీల్డ్ క్యాచ్‌లు అందుకున్న భారత ఆటగాళ్లలో ఇదే అత్యుత్తమ నిష్పత్తి. ప్రపంచవ్యాప్తంగా ఈ జాబితాలో

యూఏఈ ఆటగాడు మహమ్మద్ వసీమ్ మాత్రమే తిలక్ కంటే ముందున్నాడు. వసీమ్ 99 మ్యాచ్‌ల్లో 76 క్యాచ్‌లు అందుకుని 0.767 నిష్పత్తితో అగ్రస్థానంలో ఉన్నాడు.

భారత దిగ్గజాల సరసన చోటు

టీ20ల్లో భారత్ తరఫున అత్యధిక క్యాచ్‌లు అందుకున్న ఆటగాళ్ల జాబితాలో తిలక్ ఐదో స్థానంలో నిలిచాడు. రోహిత్ శర్మ 65 క్యాచ్‌లతో అగ్రస్థానంలో ఉండగా.. హార్దిక్ పాండ్యా 64, సూర్యకుమార్ యాదవ్ 58, విరాట్ కోహ్లీ 54 క్యాచ్‌లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇప్పుడు తిలక్ 50 క్యాచ్‌లతో ఈ జాబితాలో చోటు సంపాదించాడు.

రంజీ ట్రోఫీకి అన్యాయం.. బీసీసీఐ షెడ్యూలింగ్‌పై గవాస్కర్ అసంతృప్తి

- రంజీ ట్రోఫీ సమయంలో ఇండియా 'ఏ' మ్యాచ్‌ల నిర్వహణపై గవాస్కర్ విమర్శలు
- కీలక ఆటగాళ్లు రాష్ట్ర జట్లకు దూరమవుతున్నారని ఆవేదన
- రంజీ ట్రోఫీకి బీసీసీఐ పెద్దపీట వేయాలని డిమాండ్

హైదరాబాద్ పెన్ పవర్: భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రంజీ ట్రోఫీకి ప్రాధాన్యత ఇవ్వకుండా, అదే సమయంలో ఇండియా 'ఏ' మ్యాచ్‌లను షెడ్యూల్ చేయడాన్ని ఆయన తప్పుబట్టాడు. ఈ విధానం వల్ల దేశవాళీ టోర్నీ ప్రాధాన్యతను బీసీసీఐయే తగ్గిస్తోందని ఆయన విమర్శించాడు. రంజీ ట్రోఫీ సీజన్ కొనసాగుతుండగా ఇండియా 'ఏ' మ్యాచ్‌లు నిర్వహించడం వల్ల చాలా మంది కీలక ఆటగాళ్లు తమ రాష్ట్ర జట్లకు అందుబాటులో ఉండటం లేదని గవాస్కర్ అన్నాడు. ఇటీవలే ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన మ్యాచ్ కారణంగా రజత్ పటిదార్, దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్ వంటి ఆటగాళ్లు తమ జట్ల తొలి రంజీ మ్యాచ్‌లకు దూరమయ్యారని గుర్తుచేశాడు. త్వరలో జరగనున్న న్యూజిలాండ్ 'ఏ' పర్యటనతో ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేశాడు. "రంజీ ట్రోఫీలో అగ్రశ్రేణి ఆటగాళ్లు పాల్గొనకపోవడం వల్ల దేశవాళీ క్రికెటర్ల నిజమైన సత్తాను అంచనా వేయడం కష్టంగా మారుతోంది. రంజీల్లో రాణించిన కొందరు అంతర్జాతీయ స్థాయిలో ఇబ్బంది పడటం మనం చూస్తున్నాం" అని గవాస్కర్ పేర్కొన్నాడు. పోటీ బలహీనపడితే ఒక బ్యాటర్ 2000 పరుగులు చేయడం, బౌలర్ 100 వికెట్లు తీయడం వంటి తప్పుడు గణాంకాలు నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించాడు. అన్ని రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ప్లేట్ డివిజన్‌ను చేర్చడం వల్ల టోర్నీ మొత్తం ప్రమాణాలు తగ్గాయని కూడా గవాస్కర్ అన్నాడు. ఇండియా 'ఏ' మ్యాచ్‌లను దేశవాళీ సీజన్‌కు అడ్డంకి లేకుండా నిర్వహించాలని, రంజీ ట్రోఫీకి బీసీసీఐ పెద్దపీట వేయాలని సన్నీ సూచించాడు. గవాస్కర్ వాదనకు మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా మద్దతు పలకడం గమనార్హం.

సచిన్, యువీ, గంభీర్‌లను ఎందుకు తప్పించామో వాళ్లకు తెలుసు: సందీప్ పాటిల్

- భారత క్రికెట్ భవిష్యత్తుకే తాము ప్రాధాన్యత ఇచ్చామన్న మాజీ చీఫ్ సెలెక్టర్
- ఆ నిర్ణయాలు తన ఒక్కడివే కావని, ఐదుగురు సభ్యుల కమిటీ సమష్టిగా తీసుకుందని వెల్లడి
- స్నేహితుడని జట్టులోకి తీసుకోలేమని, దేశ ప్రయోజనాలే ముఖ్యమని వ్యాఖ్య
- 2012-2016 మధ్య భారత జట్టులో జరిగిన మార్పులపై కీలక విషయాలు వెల్లడి

హైదరాబాద్ పెన్ పవర్: భారత క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, యువరాజ్ సింగ్, గౌతమ్ గంభీర్, జహీర్ ఖాన్ వంటి వారిని జట్టు నుంచి ఎందుకు తప్పించాల్సి వచ్చిందో లేదా వారు ఎందుకు రిటైర్ అవ్వాల్సి వచ్చిందో ఆ కారణాలు వారికే తెలుసని భారత మాజీ క్రికెటర్, మాజీ చీఫ్ సెలెక్టర్ సందీప్ పాటిల్ తెలిపాడు. భారత క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వ్యక్తిగత సంబంధాల కంటే దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేయాల్సి వచ్చిందని స్పష్టం చేశాడు. 1983 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన సందీప్ పాటిల్, 2012 నుంచి 2016 వరకు ఐదుగురు సభ్యుల సీనియర్ సెలక్షన్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించాడు. ఈ కాలంలో భారత జట్టులో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. దూరదర్శన్‌లో ప్రసారమైన 'ది గ్రేట్ ఇండియన్ క్రికెట్ షో'లో పాటిల్ ఈ విషయాలను వెల్లడించాడు. "ముందుగా ఒకటి స్పష్టం చేయాలనుకుంటున్నాను. ఈ నిర్ణయాలు నేను ఒక్కడినే తీసుకున్నవి కావు. ఐదుగురు సభ్యుల సెలక్షన్ ప్యానెల్ ఉండేది, నేను దానికి ఛైర్మన్‌ను మాత్రమే. మేము తీసుకున్న ప్రతి నిర్ణయం భారత క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకున్నదే" అని వివరించాడు. 2011 వన్డే ప్రపంచకప్ విజయం తర్వాత భారత జట్టులో సమూల మార్పులు అవసరమయ్యాయి. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ ఆటగాళ్ల స్థానంలో యువ ప్రతిభకు అవకాశం కల్పించారు. "సచిన్, గంభీర్, యువరాజ్, జహీర్ వంటి గొప్ప ఆటగాళ్లు జట్టుకు దూరమవడం బాధాకరమే. కానీ, ఆ కారణాలు వారికి తెలుసు. సెలెక్టర్లుగా దేశం, బీసీసీఐ, భారత క్రికెట్ ప్రయోజనాలకు మొదటి స్థానం ఇవ్వడమే మా కర్తవ్యం" అని పాటిల్ తెలిపాడు. ఆటగాళ్లతో స్నేహం ఉండొచ్చు కానీ, వృత్తిపరమైన బాధ్యతల విషయంలో ఒక హద్దు ఉండాలని పాటిల్ అభిప్రాయపడ్డాడు. "అతడు నా స్నేహితుడు కాబట్టి జట్టులోకి తీసుకుంటాను అని చెప్పలేం. ఈ బాధ్యతను చాలా సీరియస్‌గా తీసుకోవాలి. కొన్నిసార్లు మనకు నచ్చని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది, కానీ భారత జట్టు మంచి కోసమే వాటిని అమలు చేయాలి" అని పేర్కొన్నాడు. తమ నిర్ణయాలు దీర్ఘకాల స్నేహాలను కూడా ప్రభావితం చేశా యని, అయినా జట్టు ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశాడు.

స్ట్రాప్‌లెస్ డెనిమ్ బాడీకాన్ డ్రెస్‌లో ఆకట్టుకుంటున్న అవికా గోర్

నాని స్టైల్ అదుర్స్.. 'బ్లడీ రోమియో' కోసం లుక్ ఛేంజ్!

టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని వరుస హిట్‌లతో దూసుకుపోతూ తన మార్కెట్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తున్నారు. ఇటీవలే విడుదలైన 'ది ప్యారడైజ్' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న నాని, వెంటనే తన తదుపరి గ్యాంగ్‌స్టర్ డ్రామా 'బ్లడీ రోమియో' కోసం సిద్ధమయ్యారు. స్టైలిష్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా కోసం నాని సూపర్ స్టైలిష్ మేకోవర్ అయ్యారు. తాజాగా పూర్తయిన ఈ ఫోటోషూట్ విశేషాలు మరియు సినిమా అప్‌డేట్స్ వీడియో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

సుజీత్ మార్క్ వింటేజ్ అండ్ స్టైలిష్ లుక్:

టాలీవుడ్ లో 'రన్ రాజా రన్', 'సాహో', 'ఓజీ' వంటి చిత్రాలతో తనదైన స్టైలిష్ మేకింగ్‌తో ఆకట్టుకున్న దర్శకుడు సుజీత్, ఈసారి నాని లుక్‌ను పూర్తిగా రీఇన్వెంట్ చేశారు. ఈ సినిమా కోసం నాని తన హెయిర్‌స్టైల్‌ను మార్చడంతో పాటు క్రేజీ ట్రెండీ స్పెక్స్ ధరించి సరికొత్త గ్లామరస్ అండ్ రఫ్‌గా కనిపించనున్నారు. ఇక మేకర్స్ ఇప్పటివరకు నాని పూర్తి లుక్‌ను బయటకు వదలకుండా కేవలం గ్లింప్స్‌తోనే ప్రేక్షకుల్లో అంచనాలను విపరీతంగా పెంచేశారు.

రోమియో కిచెన్ షురూ కాబోతోంది:

గత రెండేళ్లుగా 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్న నాని, ఇప్పుడు ఎలాంటి గ్యాప్ తీసుకోకుండా 'బ్లడీ రోమియో' సెట్స్‌లోకి అడుగుపెడుతున్నారు. అక్టోబర్ 16 లేదా 17 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. తొలి షెడ్యూల్‌లోనే కొన్ని అత్యంత కీలకమైన యాక్షన్ ఘట్టాలను చిత్రీకరించేందుకు సుజీత్ అండ్ టీమ్ పక్కా ప్లాన్‌తో సిద్ధమయ్యారు.

నాని వైవిధ్యమైన క్యారెక్టరైజేషన్:

ఫిల్మ్‌నగర్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త మాస్ గ్యాంగ్‌స్టర్ అవతారంలో అలరించబోతున్నారు. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా ఒక డిఫరెంట్ షేడ్ ఉన్న చెఫ్ పాత్రలోనూ లేదా ద్విపాత్రాభినయంలోనూ ఆయన కనిపిస్తారని టాక్ నడుస్తోంది. ఒకవైపు మాస్ యాక్షన్, మరోవైపు వింటేజ్ స్టైల్స్ కలగలిపి సుజీత్ ఈ కథను ఎంతో ఆసక్తికరంగా డిజైన్ చేశారు.

నిర్మాణంలో రాజీ పడని మేకర్స్:

ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను వెంకట్ బోయినపల్లి నిహారిక ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ మాస్టర్ చెఫ్స్ కాంబినేషన్‌లో వస్తున్న 'బ్లడీ రోమియో' థియేటర్లలో ప్రేక్షకులకు మైండ్ బ్లాకింగ్ ఫీస్ట్ ఇవ్వడం ఖాయమని మేకర్స్ నమ్ముతున్నారు. సుజీత్ దర్శకత్వం, నాని పాత్ర ఈ సినిమాను పాన్ ఇండియా రేంజ్‌కు తీసుకెళ్తాయని భావిస్తున్నారు. 'బ్లడీ రోమియో' కోసం నాని కొత్త లుక్‌లోకి మారడం ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్‌గా మారింది. ఇప్పటికే విడుదలైన అప్‌డేట్స్‌తో సినిమాపై అంచనాలు పెరిగాయి. నాని పూర్తి లుక్ బయటకు వస్తే ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

ఐవరీ రంగు తామర పువ్వుల డిజైన్ చీరలో పండుగ శోభను వెదజల్లుతున్న రీతూ వర్మ

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965